

బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీ తదితరులు



స్వర్ణాల చెరువు ఘాట్‌లో కిక్కిరిసిపోయిన భక్తజనం



జర రోటీ దేదో దీదీ!! : ఇష్టమైన రొట్టె కోసం పోటీపడుతున్న భక్తులు



భక్తజనం తుళ్లింత.. సింహపురి పులకింత!



అర్ధరాత్రి తర్వాత గంధమహోత్సవం
భక్తులతో కిక్కిరిసిన స్వర్ణాల చెరువు ఘాట్
ఒక్కరోజే 4 లక్షల మంది వచ్చి ఉంటారని అంచనా

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా కోరికలు తీర్చే రొట్టెల పండుగకు భక్తజనం పోటెత్తింది. ఆకాశం ఉరిమిందా.. నేల ఈనిందా అన్న చందంగా బారాషహీద్ దర్గాకు భక్తులు తరలివచ్చారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత మంగళవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం జరిగింది. కోటమిట్టలోని అమీనియా మసీదులో గంధం కలిపిన బిందెలతో ఊరేగింపుగా బారాషహీద్ దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దర్గాలోని అమరుల సమాధులకు కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీ, ఇతర మతపెద్దలు గంధం ఎక్కించారు. ఈ సందర్భంగా గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ ఘట్టం ముగిచడంతో తెల్లవారుజాము నుంచి రొట్టెల పండుగ ప్రారంభమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. దారులన్నీ దర్గా వైపే అనే విధంగా దర్గాకు వచ్చే రోడ్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేసవిని తలపించేలా భానుడు భగ్గుమన్నా మొక్కవోని విశ్వాసంతో వరాల రొట్టెను అందుకునేందుకు భక్తులు రావడం విశేషం. మంగళవారం ఒక్కరోజే దాదాపు 4 లక్షలు మందికిపైగా హాజరయ్యారని అధికారులు అంచనా వేశారు. దీంతో ఇప్పటివరకు రొట్టెల పండుగకు సమారు 8లక్షలు మందికిపైగా హాజరై ఉంటారని అధికారులు తెలిపారు.

● రొట్టెల కోసం పోటీ

స్వర్ణాల తీరంలో వరాల రొట్టెల కోసం భక్తులు ఆరాటం అంతాఇంతా కాదు. లక్షలాది మంది జనంలో ఉద్యోగం, వివాహం, సంతానం రొట్టెలు పట్టుకునేందుకు ఎంతో శ్రమించారు. స్వర్ణాల ఘాట్‌లో ఏర్పాటు

- మిగతా 7లో..

మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అన్ని రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు దుమ్మెత్తిపోశాయి. నల్లపరెడ్డి కుటుంబ ప్రతిష్టను ప్రసన్న మంట గలిపాడంటూ మండిపడ్డారు. వైసీపీ నాయకులకు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం లేదనడానికి ప్రసన్న మాటలే నిదర్శనమన్నారు. నెల్లూరు, కోవూరులలో మహిళలు భారీ ప్రదర్శనలు చేపట్టాయి. అలాగే టీడీపీ, జనసేన, బీజేపీ, కమ్యూనిస్టుపార్టీలు, వివిధ మహిళాసంఘాలు వేర్వేరు ప్రకటనలు, ప్రెస్‌మీట్లలో ప్రసన్న తీరును తీవ్రంగా ఖండించాయి.



బుచ్చిలో ప్రసన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు



నెల్లూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న మహిళలు



ప్రసన్నపై ఫైర్!

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలపై దుమారం
- నల్లపరెడ్డి కుటుంబం ప్రతిష్టను దెబ్బతీశాడంటూ ఆగ్రహం
- వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కోవూరు, నెల్లూరులో మహిళల ప్రదర్శనలు
- బుచ్చిలో దిష్టిబొమ్మ దహనం

కోవూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కోవూరులో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక శ్రీవీరాంజనేయస్వామి ఆలయం నుంచి తాలూకాఫీసు కూడలి వరకు ఈ ర్యాలీ జరిగింది. మహిళల ఔనత్యాన్ని కించపరస్తున్న ప్రసన్నకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించే ప్రసన్నను శిక్షించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కోవూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు తరలిరావడంతో కోవూరు- నెల్లూరు మార్గం కిక్కిరిసిపోయింది. అనంతరం పోలీసుస్టేషన్‌లో సీఐ సుధాకరరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ప్రదర్శనకు మహిళా నాయకులు అమరావతి, యాకసిరి వెంకటరమణమ్మ, కప్పిర రేవతి, యాకసిరి వనమ్మ, చలంచర్ల కామేశ్వరి, భవాని తదితరులు నాయకత్వం వహించారు.



● ప్రసన్నపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి డిమాండు చేశారు. తహసీల్దారు కార్యాలయ కూడలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రసన్న ఇలా అసభ్యంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ప్రదర్శనలో టీడీపీ నాయకులు మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి, సుధాకరరెడ్డి, జనార్దనరెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, అచ్యుతరెడ్డి, నాపా వెంకటేశ్వర్లు, వీరేంద్ర, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** స్థానిక బస్టాండు సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను టీడీపీ శ్రేణులు దహనం చేశాయి. పట్టణ యూత్ అధ్యక్షుడు కాలంశెట్టి కిషోర్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రసన్న పదతులు మార్చుకోవాలని, ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు పార్థసారథి, సుమన్, లోకేష్, మణి, పవన్, నాగేశ్వరరావు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

● **కొడవలూరు :** గుండాలమ్మపాలెం ప్రధాన కూడలి నుంచి రోడ్డు వరకు మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రసన్న ఎమ్మెల్యే ప్రశాంతికి ప్రసన్న క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుజిత్ కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రసన్నను అరెస్ట్ చేయాలి

నెల్లూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరురూరల్‌లో మహిళలు మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. గాంధీనగర్ వాటర్ ట్యాంకు నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి, విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలు సగటు సమాజం తలదించేకునేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల పోలీసులు లోతైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మాజీ మేయర్ భానుశ్రీ, మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు : శ్రీధర్‌రెడ్డి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై నల్లపరెడ్డి ప్రసన్న చేసిన వ్యాఖ్యల పట్ల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రసన్న ఇంటిపై దాడి వీపీ ఆర్ దంపతుల పనికాదని, వారి అభిమానులు చేసి ఉండవచ్చని తెలిపారు. ఈ దాడి జరిగిన వెంటనే వీపీఆర్ దంపతులు పోలీసులకు తగు విచారణ జరపాలని ఆదేశించినట్లు వెల్లడించారు. నిత్యంపేదలకు సహాయం చేసే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు.



ప్రజాజీవితం నుంచి ప్రసన్నను బహిష్కరించాలి
ఏఎస్పీకి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు

నెల్లూరు (క్రైం) : సంస్కార రహిత ప్రసన్నను ప్రజాజీవితం నుంచి బహిష్కరించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను ప్రశాంతిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కోలేక తనను అసభ్య పదజాలంతో దూషించారని అన్నారు. తాను ప్రసన్న హయాంలో జరిగిన గ్రావెల్ దోపిడీ, అవినీతి అక్రమాల గురించి మాట్లాడుతుంటే మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా సభ్య సమాజం తలదించుకునేలా నోరు పారేసుకున్న ప్రసన్నను మహిళా సమాజం క్షమించదన్నారు. ప్రసన్న అవినీతి అక్రమాలు చెల్లవంటూ కోవూరు ప్రజానీకం ఛీ కొట్టి శాశ్వతంగా ప్రజా జీవితం నుంచి వెలివేశారన్నారు. సంస్కార రహితంగా మాట్లాడే ప్రసన్నపై చట్టపరంగా ఎదుర్కొంటానన్నారు. ఏఎస్పీని కలిసిన వారిలో బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలో భాగమే : కావ్య

కావలి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు వైసీపీ కుట్రలో భాగమేనని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ కూటమి నేతలపై ఒక పథకం ప్రకారం రెచ్చగొట్టే విధంగా మాట్లాడిస్తోందన్నారు. మహిళ ఎమ్మెల్యేపై అసభ్యంగా మాట్లాడి నల్లపురెడ్డి కుటుంబానికే ప్రసన్న కళంకం తెచ్చారన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, వ్యక్తిగత విషయాల్లోకి వెళ్లి అసభ్య పదజాలాలు వాడటం వైసీపీ నేతలకే చెల్లుతుందన్నారు. ఇప్పటికైనా ప్రసన్న ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేయద్దు : బీజేపీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రాజకీయ విమర్శలు చేయాలే కానీ వ్యక్తిగత విమర్శలు చేయవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి తదితర అంశాలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు చేయడం సహజమన్నారు. అయితే అందుకు భిన్నంగా కోవూరులో ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమంటోందన్నారు. ఇది మంచి పద్ధతి కాదని రాజకీయాలలో ఇలాంటి పరిస్థితులు రాబోవు రోజుల్లో పునరావతం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రాఘవేంద్ర, ముక్కు రాధాకృష్ణగౌడ్, దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రసన్నపై చర్యలు తీసుకోవాలి : జనసేన



నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట) : సభ్య సమాజం తలదించుకునేలా ఒక మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నేత, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పట్ల అసభ్యకరమైన పదజాలంతో దూషించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదని, దౌర్జన్యకాండను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ప్రశాంతిరెడ్డి నివాశంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ తదితరులు ఉన్నారు.

మహిళలే బుద్ధి చెబుతారు : ఇంటూరి

కందుకూరు : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన దిగజారుడు వ్యాఖ్యలు సిగ్గుచేటని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళలపై ఇలాంటి సంస్కారహీన వ్యాఖ్యలు తగవని, సమాజానికి సేవచేస్తూ ప్రజల్లో విశ్వాసం, అభిమానం సంపాదించిన మహిళా నాయకురాలిపై అసభ్యంగా మాట్లాడటం ప్రసన్నకుమార్‌రెడ్డి దిగజారుడుతనాన్ని సూచిస్తోందన్నారు.

'కౌన్సెలింగ్ లేదు.. కనీసం ఆప్షన్లు కూడా అడగలేదు.. అయినా బదిలీ చేసేశారు. రిక్వెస్టు పెట్టుకోని వాళ్లను కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు.. కొందరికి కనీసం బదిలీ చేసిన ప్రాంతం ఏదో కూడా తెలుపకుండా గాల్లో నిలబెట్టేశారు. ముడుపులు ఇచ్చిన వారికి దగ్గరి ప్రాంతాల్లో, రిక్వెస్టు పెట్టని వారికి దాదాపుగా 200కి.మీ దూరానికి స్థాన చలనం కల్పించారు.' ఇదీ పశుసంవర్ధక శాఖలో ఉద్యోగుల బదిలీల తీరు. దీనికంతటికి కారణం ఓ జిల్లా అధికారేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉద్యోగులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ బది'లీలలు'తో అంతంత మాత్రంగా ఉన్న పశుసంవర్ధకశాఖ పరువు కాస్తా వీధిన పడినట్లయింది. దీనిపై కలెక్టరు విచారణ చేయిస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు సైతం ఆ అధికారికి ఫోన్ చేసి తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

- కౌన్సెలింగ్ లేదు.. కనీసం ఆప్షన్స్ కూడా లేవు!
- రిక్వెస్టు లేకున్నా బదిలీలు... భారీగా వసూళ్లు...?
- ఏహెచ్‌ఏల బహిరంగ ఆరోపణలు
- కలెక్టరుకు ఫిర్యాదు
- అధికారిపై నేతల ఆగ్రహం..?

భారీగానే వసూళ్లు...?

ఒక అధికారి అన్నీ తానై చూసుకుంటూ, మిగిలిన అధికారుల జోక్యం అవసరం లేదంటూ బదిలీల ప్రక్రియ నడిపినట్లు పలువురు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో బదిలీకి భారీగానే ముడుపులు వసూళ్లు చేసినట్లు కూడా జిల్లా కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరి నుంచి రూ.30వేల నుంచి అవసరాన్ని బట్టి రూ.50వేల వరకు దండినట్లు చెప్పుకుంటున్నారు. దీనిపై ఏహెచ్‌ఏలు కలెక్టరుకు సైతం ఫిర్యాదు చేశారు. డబ్బులిచ్చిన వారికి దగ్గర్లో పోస్టింగు ఇచ్చారని, తమకి మాత్రం 200కి.మీ దూరంలో ఇచ్చారంటూ కలెక్టరుకు విన్నవించారు. విచారించి న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై కలెక్టర్ సైతం విచారణ చేపట్టే అవకాశం ఉందని పలువురు అధికారులు చెబుతున్నారు.



పశుసంవర్థక శాఖలో బది'లీలలు'

నెల్లూరు(వ్యవసాయం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖలో మొన్నటి వరకు ఓ సీటు కోసం పోటీ పడటం చర్చనీయాంశమైంది. అనంతరం ఓ వివాదంపై రాష్ట్ర వ్యాప్తంగా మాట్లాడుకున్నారు. తాజాగా పశుసంవర్ధకశాఖ సహాయకుల బదిలీల్లో అవకతవకలు జరిగాయంటూ కలెక్టరుకే ఏహెచ్‌ఏలు ఫిర్యాదు చేయడం చర్చకు దారితీసింది. రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పశుసంవర్ధకశాఖ సహాయకుల (ఏహెచ్ఏ)లో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఐదేళ్ల సర్వీసు నిండని వారు రిక్వెస్టు పెట్టుకుంటే వారికి కూడా బదిలీలు చేపట్టాలని సూచించింది. ఈ క్రమంలో ఐదేళ్లు నిండిన ఏహెచ్‌ఏలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలి. సీనియారిటీ ప్రాతిపదికన ఆప్షన్లు ఇవ్వాలి. అనంతరం బదిలీలు జరపాలి. అయితే జిల్లాలో ఈ నిబంధనలేవీ పాటించలేదనే ఆరోపణలున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లెటర్లు తెచ్చుకున్న వారికి కూడా పని జరగలేదనేది చర్చనీయాంశంగా మారింది.

రిక్వెస్టులు పెట్టని వారు దాదాపు 30మంది..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లు నిండిన వారికి, రిక్వెస్టులు పెట్టిన వారికి మాత్రమే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల బదిలీలపై వచ్చిన, కొత్తగా ఉద్యోగంలో చేరిన దాదాపు 30మందికి పైగా ఏహెచ్‌ఏలను సైతం బదిలీ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. వారు పనిచేస్తున్న రైతు సేవా కేంద్రం నుంచి రిలీవ్ చేసి అక్కడ మరొకరిని నియమించినట్లు సమాచారం. ఇలా రిక్వెస్టులు లేకుండా బదిలీ అయిన దాదాపు 12 మందికి పోస్టింగు ఎక్కడో చూపకుండా గాల్లోనే ఉంచినట్లు సమాచారం. దీంతో వీరందరూ లబోదిబో మంటున్నారు. పశుసంవర్ధకశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

● ప్రజాప్రతినిధుల ఆగ్రహం..

ఏహెచ్‌ఏల బదిలీలకు సంబంధించి జరుగుతున్న వ్యవహారంపై జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే కొంత మంది ఆ అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం, అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తామిచ్చిన సిఫార్సు లెటర్లను కూడా పట్టించుకోకుండా పక్కన పెడతావా అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహించినట్లు తెలిసింది.

● కౌన్సెలింగ్‌లో అధికారులేరి....

ఒకేచోట ఐదేళ్ల సర్వీసు నిండిన ఏహెచ్‌ఏలు జిల్లాలో దాదాపు 75 మంది ఉన్నారు. కుటుంబ పరిస్థితులు, అనారోగ్య సమస్యలతో 61 మంది రిక్వెస్టు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు జిల్లా కార్యాలయాల అధికారుల సమక్షంలో బదిలీల కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. అయితే ఓ అధికారి అన్నీ తానై, ఓ ఏహెచ్‌ఏను అసిస్టెంటుగా పెట్టుకుని మొత్తం వ్యవహారం నడిపినట్లు చర్చించుకుంటున్నారు.

18న జడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (జడ్పీ), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ జరగనుంది. నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, విద్యా, విద్యుత్ శాఖలతో సమీక్ష జరుగుతుందని తెలిపారు. సభ్యులందరితోపాటు జిల్లాస్థాయి అధికారులు కూడా తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రాక

నెల్లూరు(హరనాథపురం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి బుధవారం నెల్లూరుకు వస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బీ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కావలికి చేరుకుని అక్కడి నుంచి కారులో ర్యాలీగా నెల్లూరులోని పినాకినీ గెస్ట్ హౌస్ పక్కనున్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం కార్యాలయ కార్యకలాపాలపై సమీక్షిస్తారని, 11.30 గంటలకు బారాషహీద్ దర్గాను సందర్శిస్తారని, 12 గంటలకు కరెంట్ ఆఫీసు సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తారని వివరించారు. శ్రీదేవి 12.30 గంటలకు విజయవాడకు బయలుదేరి వెళతారని తెలిపారు.

ఎర్రగుంటలో బాల్యవివాహాలపై అవగాహన

వెంకటాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో సైబర్ క్రైమ్, చైల్డ్, ఉమెన్, ప్రొహిబిషన్, చైల్డ్ మ్యారేజ్, లైంగిక వైదింపులు వంటి చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరిపితే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అడ్వకేట్ ఎస్ ప్రశాంతి తదితరులున్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9304
వెండి కిలో ధర	రూ. 110600
వెండి ఒక గ్రాము	రూ. 113.60

సుపరిపాలనలో తొలి అడుగు



కార్యక్రమంలో పాల్గొన్నటీడీపీ నేతలు

రాపూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని సిద్దవరంలో నిర్వహించారు. టీడీపీ నాయకులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, చెన్ను భాస్కర్ రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు చెన్ను అశోక్‌రెడ్డి, నల్లవడ్ల వెంకట రమణారెడ్డి, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, మధురెడ్డి, చెన్ను పెంచలరెడ్డి, చానా, మందాటి చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విడవలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విడవలూరు జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దీనదయాల్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ శాంతి, ఎంఎల్‌పీఎచ్‌లు కీర్తి, సుజాత, ఝాన్సీ ఆశ వర్కర్లు నాగవణి, మానస పాల్గొన్నారు.

నేడు 'అడ్వాన్స్ ఇండెక్స్'పై అవగాహన సదస్సు

విడవలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు 'అడ్వాన్స్ ఇండెక్స్' అంశంపై ఒకరోజు శిక్షణా కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నగేష్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. మండల స్థాయి అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు హాజరు కావాలని తెలిపారు.

వైఎస్ఆర్ జయంతి

సైదాపురం, జూలై8(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం వైసీపీ మండల అధ్యక్షుడు మన్నారపు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ బొలిగర్ల శివ కుమార్ యాదవ్, న్యాయవాది నంది మండలం అబ్బిరాజు, నాయకులు అమ్మినేని శివ కుమార్, రామ్‌గోపాల్ రెడ్డి, మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరపంటలతో చీడపీడల నివారణ

విడవలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎర పంటలను సాగు చేయడం వల్ల వేరుశనగలో చీడపీడలను నివారించవచ్చునని వ్యవసాయాధికారి లక్ష్మి తెలిపారు. రామచంద్రాపురం, దండిగుంట గ్రామాల్లో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు అర్హత ఉన్న రైతులు వన్‌బికి ఆధార్ కార్డును జూలై 30లోగా లింక్ చేసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమ నేత వైఎస్సార్



నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

ముత్తుకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉపయోగపడే పలు సంక్షేమ పథకాలను అమలు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోయారని మండల వైసీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా స్థానిక యాక్సిస్ బ్యాంకు కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. బ్రహ్మదేవంలో అగ్ని మస్తాన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండవరపు సుగుణ, నాయకులు బసవంగారి సురేష్, శ్రీనివాసులురెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు, శివ, సాయి, రహీం, తదితరులు పాల్గొన్నారు.

'మృత్యు' వంతెనలు..!

- కనుపూరు కాలువపై కూలిన రక్షణ గోడలు
- రోడ్డు మార్జిన్ మట్టి కుంగిపోయిన వైనం
- భయం గుప్పిట్లో వాహనదారులు
- ముందస్తు చర్యలు చేపట్టకుంటే ప్రమాదమే..
- వర్షాలు కురిస్తే మరింత దెబ్బతినే అవకాశం




పొలిచెర్లపాడు రోడ్డులో వంతెన వద్ద కుంగిన మార్జిన్ మట్టి

వెంకటాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని గ్రామాల్లో సాగునీటి కాలువలపై దశాబ్దాల క్రితం వంతెనలు నిర్మించారు. వీటి నిర్వహణ, మరమ్మతులను గత ప్రభుత్వాలు విస్మరించడంతో కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధానంగా వంతె నలకు రక్షణ గోడలు కూలిపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ వంతెన వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులను కూడా అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు పొదలకూరు, సంగం, ఆత్మకూరు వైపు నుంచి భక్తులు, ప్రయాణీకులు అధిక శాతం వస్తూ ఉంటారు. వారికి పొలిచెర్లపాడు మార్గం ఎంతో అనుకూలంగా ఉంటుంది. కసుమూరు నుంచి పొలిచెర్లపాడు మీదుగా పొదలకూరుకు, వెంకటాచలం నుంచి కందలపాడు మీదుగా ఆమంచర్లకు వెళ్లే రోడ్డు మార్గాలున్నాయి. కానీ ఈ మార్గాల్లో ఉన్న వంతెనలు దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రధానంగా కనుపూరు కాలువ పై నిర్మించిన వంతెనలైతే మరీ అధ్వానంగా ఉన్నాయి. రక్షణ గోడలు కూలిపోయి రోడ్డు ప్రమా దాలకు నిలయాలుగా మారిపో యాయి. ముఖ్యంగా కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు వచ్చే యాత్రికులు పొలిచెర్లపాడు మీదుగా పొదలకూరుకు వెళ్లి అటు నుంచి కడప, ఏఎస్ పేట దర్గాకు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. అలాగే పొలిచెర్లపాడు సమీపంలో క్వారీ ఉండడంతో కంకర టిప్పర్లు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే పొలిచెర్లపాడు మీదుగా వెళ్లే సమయంలో కనుపూరు కాలువపై రెండు వంతెనలు ఉండగా అవి శిథిలావస్థకు చేరు కునే పరిస్థితి నెలకొంది. కనీసం రక్షణ గోడలు కూడా సక్రమంగా వంతెనలపై లేకపోవడంతో పలు మార్లు ప్రమాదాలు జరగడంతో పలువురు గాయపడ్డారు. ప్రధా నంగా ఒక వంతెన వద్ద రోడ్డు మార్జిన్ మట్టి కొట్టుకెళ్లి ఓవైపు రోడ్డు కొంతవరకు కుంగిపోయింది. ఆ ప్రాంతం ప్రమాదభరితంగా తయారైంది. వర్షాలు వస్తే రోడ్డు మరింతగా దెబ్బతినే ప్రమాదం ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు మార్జిన్ మట్టి కుంగిపో వడంతో ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఉందని వాహన చోదకులు చెబుతున్నారు. ముఖ్యంగా కొత్తవారైతే రాత్రి వేళల్లో ఈ మార్గంలో రావడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని వాహనచోదకులు భయపడుతున్నారు. భయం గుప్పిట్లో రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వాహనాలు, కంకర టిప్పర్లు ఎక్కువగా ఈ మార్గం గుండా తిరుగు తుంటా యని, ఈ వంతెన వద్ద ఎదురైతే ఎక్కడి వాహనాలు అక్కడే ఆగి పోవాల్సిందేనంటున్నారు. కొంతభాగం రక్షణ గోడలు కూలిపోయి ప్రమాదభరితంగా ఉన్నటిప్పటికి వంతెన వద్ద కనీస మరమ్మత్తులు చేపట్టి రెండువైపులా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతు న్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనలను కూల్చివేసి నూతన వంతెనలను నిర్మించాలని వాహనచోదకులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు కూడా సక్రమంగా లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నూతన వంతెనలు నిర్మించే వరకు రోడ్డు మార్జిన్ మట్టి కొట్టుకెళ్లిన ప్రాంతంలో మరమ్మత్తులు చేయించాలని, ఇరువైపులా కొత్తగా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతు న్నారు. ఆ దిశగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి కృషి చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కనుపూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి ● మసీదు అభివృద్ధికి రూ.2లక్షలు



మసీదు అభివృద్ధికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభు త్వం పని చేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో ని కనుపూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రె డ్డి, కోడలు శృతిరెడ్డిలతో కలిసి పర్యటించారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు - ఇంటింటికి తె లుగుదేశం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడాది క్రితం కనుపూరు పర్యటనకు సోమిరెడ్డి వచ్చిన సమయంలో ముస్లింలు మసీదు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకా రం ఏడాది కూడా పూర్తి కాకముందే సోమిరెడ్డి ఫౌండేషన్ తరపున కనుపూరు మసీదు అభి వృద్ధికి రూ. 2లక్షల చెక్కును అందజేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్ర జలు సంతోషంగా ఉన్నారన్నారు. తల్లికి వంద నం పథకం విషయంలోనూ సీఎం చంద్రబాబు కొత్త చరిత్ర సృష్టించారన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఒక కనుపూరు గ్రామంలోనే 411 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు చొప్పున రానున్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అవకాశాన్ని కల్పించారన్నారు. ఆగష్టు 15న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు, ఉప్పలపాటి ధనుంజయనాయుడు, కోదండయ్యనాయుడు, వల్లూరు వంశీకృష్ణ, శ్రీనివాసులునాయుడు, మస్తాన్‌నాయుడు, సాయి నాయుడు, మురళీనాయుడు, అమర్నాథ్ తదితరులున్నారు.

● అభివృద్ధి పనుల ప్రారంభం

పొదలకూరు : చిట్టేపల్లితిప్ప ప్రాంతంలో మంగళవారం పర్యటించిన సర్వేపల్లి ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదట మారుతీనగర్‌లో శ్రీవీరభైరవ ఆంజనేయస్వామికి కమ్మజన సేవా సంఘం ఆధ్వర్యంలో కొమ్మి లక్ష్మయ్యనాయుడుతో కలిసి పూజలు చేశారు. పొలాల్లో మొక్కలు నాటారు.

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



దర్గాలో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బారాషాహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగకు హాజరైన భక్తులు కసుమూరు మస్తాన్ వలి దర్గాకు భారీగా తరలి వచ్చారు. భక్తులతో మూడవ రోజైన మంగళవారం కసుమూరు గ్రామం కిక్కిరిసింది. మస్తాన్ స్వామిని దర్శించుకునేందుకు రెండుగంటలు పట్టింది. షాపాబావి వద్ద ఆటోల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నెల్లూరు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను మంగళవారం కూడా కొనసాగించారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భక్తులు వేలాదిగా వస్తున్నా పోలీసు బందోబస్తు కూడా లేకుండా పోయిందని విమర్శలు వ్యక్తమయ్యాయి. పొలిచెర్లపాడు మలుపు నుంచి పార్క్ వరకు రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడంతోనే ట్రాఫిక్ సమస్య నెలకొంది.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

రాపూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో నిధులు దుర్వినియోగం చేసిన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విజయవాడలోని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ భూషణ్‌కు, ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో కరుణకు ఫిర్యాదు చేశారు. నిధులు దుర్వినియోగమయ్యాయని విచారణ బృందం తేల్చినా చర్యలు తీసుకోలేదన్నారు. చర్యల్లో జాప్యం జరిగితే లోకాయుక్తను ఆశ్రయిస్తామన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

మనుబోలు,(ఆంధ్రజ్యోతి): 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 వరకు పంచాయతీకి సంబంధించిన రికార్డులను మంగళవారం ఆడిట్ అధికారులు తనిఖీ చేశారు. గడిచిన ఏడాదిలో ఈ పంచాయతీలో ముగ్గురు కార్యదర్శులు పనిచేశారు. పంచాయతీకి రాబడి, ఖర్చులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు మండలపరిషత్ కార్యాలయ రికార్డులపై ఆడిట్‌ను ఏఏవో శివరాజ్, ఏడుకొండలు, భరత్‌కుమార్ నిర్వహించారు. కార్యదర్శి గరుడయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల ఆకస్మిక తనిఖీ

కొడవలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యల్లాయపాలెం పంచాయతీలో పారిశుధ్య పనులను జడ్పీ సీఈవో మోహన్‌రావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రామాపురం మజారాలో ఎన్టీఆర్‌నగర్, ఎస్టీ కాలనీ సందర్శించి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి అక్కడ ఉన్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. క్లోరినేషన్ చేసి ప్రతిరోజు మంచినీరు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకట సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, పంచాయతీ సిబ్బంది, మండల రీసోర్స్ కో ఆర్డినేటర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జాయింట్ సెక్రటరీగా దాసరి

మనుబోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మనుబోలుకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులు దాసరి భాస్కర్ గౌడ్ నియమితులయ్యారు. దీంతో మంగళవారం మనుబోలులోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. దాసరిని మండల వైసీపీ కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ముంగర రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

జీలుగలతో భూసారం పెరుగుదల



'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

మనుబోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగుకు ముందు నేల సారం పెరగడానికి జీలగలు చల్లాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని గురివిందపూడి, చెరుకుమూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. ఎకరాకు 10 కేజీ జీలగలు చల్లాలన్నారు. అలాగే భూసార పరీక్షలు చేయించి, దాని ఆదారంగా సాగులో ఎరువుల పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు అమూల్య, శిరీష, రైతులు పాల్గొన్నారు.

సర్వే చేసి, టీబీ వ్యాధిగ్రస్థులను గుర్తించాలి

జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలి



మాట్లాడుతున్న టీబీ అధికారి ఖాదర్‌వలి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీ ణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా సర్వే ద్వారా లక్షణా లను బట్టి పరీక్షలు నిర్వహించి టీబీ వ్యాధి గ్రస్థులను గుర్తించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండ లంలోని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటెన్సిఫైడ్ టీబీ ప్రోగ్రాం, టీబీ వ్యాధి గురించి అందిస్తున్న సేవ లతోపాటు వివిధ రకాల ఆరోగ్య సేవలను గురించి వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, ఆయన ఆసుపత్రి వైద్యులుతో కలిసి "టీబీ వ్యాధి గురించి తెలుసుకుందా" పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అహ్మద్ బాబు, డాక్టర్ అవంతి, డాక్టర్ జమీమా ప్రత్యూష, సీహెచ్ఓ, సూపర్‌వైజర్లు, పీహెచ్ఎన్, ల్యాబ్ టెక్నీషియన్, యాసిన్, ఆసుపత్రి సిబ్బం ది, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ తరఫున కృషి చేస్తున్నట్లు సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లి గ్రామంలోని గిరిజన కాలనీలో మంగళవారం పర్యటించారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల కిట్లను పంపిణీ చేశారు. గ్రామంలో పందుల కారణంగా దుర్వాసన అధికంగా ఉందని, ఇళ్లల్లోకి పందులు రావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు సందూరి శ్రీహరి, పెంచలయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపాలెం, చిన్నచెరుకూరులో 'పొలం పిలుస్తోంది'!

తోటపల్లిగూడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకపాలెం, న్నచెరుకూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖాధికారులు సలహాలు ఇచ్చారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించమని సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వాడకం పెంచాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకున్న రైతులే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమాకు అర్హులని అధికారులు తెలిపారు. వ్యవసాయ భూమికి ఆధార్ అనుసంధానం చేసుకోని రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీష రాణి, శాస్త్రవేత్తలు పరమశివ మధుసూదన్, సమీరా, గ్రామ వ్యవసాయ సహాయకులు షర్మిల, శివకుమార్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏలూరుపాడులో రెండిళ్లలో చోరీ



ఏలూరుపాడులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

గుడ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరుపాడులో సోమవారం అర్ధ రాత్రి రెండు ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన నాగసూరి మురళీకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం నాగూర్‌నాగపట్నంకు బయలుదేరి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరనిది గ్రహించిన గుర్తుతెలియని దుండగులు అదే రోజు రాత్రి ఆ ఇంట్లోకి జొరబడి బీరువాలో దాచుకున్న అరకేజీ వెండి, రెండున్నర సవర్ల బంగారంతోపాటు రూ.70 వేల అపహరించుకెళ్లారు. అలాగే మురళీకృష్ణ ఇంటి పక్కన నివాసం ఉండే చేవూరి శ్రీనయ్య కూడా సొంత పనుల నిమిత్తం కొద్ది రోజుల క్రింత హైదరాబాద్ వెళ్లగా అతని ఇంట్లోకి ప్రవేశించి రెండున్నరసవర్ల బంగారం, రూ.17 వేల అపహరించుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న రెండు కుటుంబాల బాధితులు వారి బంధువుల ద్వారా ఇళ్లల్లో ఉంచిన నగదు, బంగారు వివరాలు చెప్పి చూడమనగా అవి లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ చోరీపై సమచారం అందుకున్న ఎస్ఐ వెంకట్రావు సంఘటన స్థలానికి చేరుకొని, దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటారు బైక్ బోల్తా

● యువకుడికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలైన యువకుడిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

సంగం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరుణవాయి క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం సాయంత్రం మోటారు బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు... ఆత్మకూరు నుంచి మోటారు బైక్‌పై నెల్లూరు వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన మైలురాయిని ఢీకొట్టి మోటారుబైక్‌తోపాటు యువకుడు పొలాల్లో పడ్డాడు. దీంతో ఆ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న ఆత్మకూరు సీఐ గంగాధర్ గమనించి వాహనాన్ని నిలిపి బాధితుడ్ని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆ యువకుడు అపస్మారక స్థితిలో ఉన్నందున పూర్తి వివరాలు తెలియరాలేదు.

తూ.కో అధికారుల దాడులు

● 8 దుకాణాలపై కేసుల నమోదు



కలిగిరిలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కలిగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణంలో మంగళవారం తూనికలు-కొలతలు శాఖ అధికారులు పలుషాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 దుకాణాల్లో కొలతలు తేడాపై కేసులు నమోదు చేసి రూ.24వేలు అపరాధ రుసుం విధించినట్లు కావలి డివిజన్ లీగల్ మెటాలజీ ఇన్‌స్పెక్టర్ షేక్ మోషీన్ తెలిపారు. దుకాణదారులు వస్తువుల తూకం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్యాకింగ్ వస్తువులు నూనెలు, పప్పుదినుసులు, బియ్యం వంటి సరుకులు ప్యాకెట్‌పై ముద్రించి ఉన్న పరిమాణానికి తేడా ఉండకూడదన్నారు. ప్రజలు తాము కొనుగోలు చేసే సరుకులు పట్ల ప్యాకింగ్, గడువు తేదీలను సరిచూసుకొని వస్తువులను కొనుగోలు చేసుకోవాలన్నారు. ఏదైనా దుకాణాల్లో తేడాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చికిత్స పొందుతూ ఆటో యూనియన్ అధ్యక్షుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జొన్నవాడకు చెందిన బుచ్చి ఆటో యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షుడు పాశం రాజయ్య, (59) చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు, మంగళవారం జొన్నవాడలో జరిగిన రాజయ్య అంత్య క్రియల్లో జిల్లా యూనియన్ నాయకులు కోలగట్ల సురేష్, మారుబోయిన వెంకట రాజ, చల్లకొలుసు మల్లికార్జున, మునీర్ అహ్మద్, సీపీఎం, సీఐటీయూ నాయకులు వెంకమరాజు, గుర్నాధం, శ్రీనివాసులు, ఎం. సురేష్, మాధవ్, టి. రమణయ్య, కే. వెంకటరమణయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు. రాజయ్య యూనియన్ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. రాజయ్య మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

ఇద్దరు యువకుల ఆత్మహత్య

● అనారోగ్యంతో ఒకరు..

● ఉద్యోగం రాలేదని మరొకరు బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఒకరు, ఉద్యోగం రాలేదని మరొకరు ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలపై వేదాయపాళెం పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని డ్రైవర్స్ కాలనీలో శైలజ, శివకోటాచారి దంపతులు నివసిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు మంజునాథ్ (25) కొయ్యపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకుంటున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్తాపం చెందాడు. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట శైలజ, శివకోటాచారి చెన్నైలోని కుమార్తె ఇంటికి వెళ్లగా మంజునాథ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. పక్కంటి వారి ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● నగరంలోని బీవీనగర్ రామకృష్ణానగర్‌లో లలిత కుటుంబం నివసిస్తోంది. ఆమె కుమారుడు దీపక్(24) బీటెక్ చదువుకుని ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఉద్యోగం రాలేదని తరచూ బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు కాలువలో మృతదేహం

నెల్లూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని జొన్నవాడ సర్కిల్ వద్ద నెల్లూరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. మంగళవారం స్థానికుల సమాచారంతో ఘటన స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. 40 ఏళ్ల వ్యక్తి మరణించి 5-6 రోజులు అవుతోందని తెలిపారు. జీజీహెచ్ మార్చురీకి మృతదేహాన్ని తరలించామని, గుర్తించిన వారు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570



భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శివాలయాల్లో మంగళవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూలస్థానేశ్వరాలయంలో స్వామి వారితోపాటు నందీశ్వరుడికి విశేష అభిషేకాలు, అలంకారం, పూజలు జరిగాయి. అనంతరం భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామికి వెండి చిన్న నంది వాహనంపై ప్రాకారోత్సవం జరిగింది. ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పర్య వేక్షించారు. ఇదేవిధంగా రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామికి, నందీశ్వరునికి అభిషేకాలు, పూజలు జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

రేపు గురుపౌర్ణమి

- దక్షిణామూర్తికి, వ్యాస భగవానుడికి పూజలు
- సాయిమందిరాల్లో ఉత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసంలో వచ్చే పౌర్ణమినే వ్యాస పూర్ణిమ, గురుపౌర్ణమిగా హిందువులు జరుపుకుంటారు. నాలుగు వేదాల జ్ఞానాన్ని ప్రసాదించిన వేద వ్యాసమహర్షి ఈ రోజునే జన్మించారు. సమస్త మానవాళికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పండుగ జరుపుకుంటారు. తల్లిదండ్రులు జన్మనిస్తారు. గురువు జ్ఞానాన్ని అందించి ప్రయోజకుడిని చేస్తారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే దక్కుతుంది. ఈ నేపథ్యంలో గురుశిష్యుల మధ్య పవిత్ర సంబంధానికి గురుపౌర్ణమి ప్రతీక. ఈ రోజున శిష్యులు గురుపూజ చేసి, విద్యా బుద్ధులు నేర్పినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. అలాగే పరమేశ్వరుని అంశగా ఆది గురువుగా మేధా దక్షిణామూర్తిని కొలుస్తారు. ఈ ఏడాది గురువారం రోజే గురుపూర్ణి రావడం విశేషం. ఈ సందర్భంగా దక్షిణామూర్తికి విశేష పూజలు చేస్తారు. అదేవిధంగా సాయిబాబా మందిరాల్లో వేడుకలు జరుపుతారు.

నేటి నుంచి వేడుకలు

నగరంలోని అద్దాల సాయిబాబా మందిరంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు గురుపౌర్ణమి వేడుకలు జరుగుతాయని మందిరం నిర్వా హకుడు మధు సాయి తెలిపారు. మంగళవారం మందిరంలో గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్లను ఆవిష్కరించారు. బుధవారం ఉదయం ఉస్మాన్‌సాహెబ్ పేట కోదండరామస్వామి ఆలయం నుంచి సీతాలక్ష్మణ హనుమత్సమేతంగా శ్రీరామ చంద్రుడు సాయిదర్బార్‌కు విచ్చేసి గురుపౌర్ణమి వేడుకలను ప్రారంభిస్తారని తెలిపారు. గురువారం ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు గురుపౌర్ణమి వేడుకలు జరుగుతాయని, అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు.



అద్దాల సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మధుసాయి, భక్తులు

సెస్సులు వచ్చేనా..?

వ్యథలు తీరేనా..?

- గ్రంథాలయ సంస్థకు రూ.39కోట్ల బకాయి
- పన్నులు చెల్లించని స్థానిక సంస్థలు
- అభివృద్ధి పనులకు నిధుల కొరత
- పూర్తికాని నూతన భవనం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్సు బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.39కోట్లు జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సి ఉంది. అందులో ఒక్క నెల్లూరు నగర పాలక సంస్థ నుంచే రూ.35,64,00,000 రావలసి ఉంది. ఇక, గూడూరు మున్సిపాలిటీ నుంచి రూ.1,20,00,000, కావలి మున్సిపాలిటీ రూ.54లక్షలు, ఆత్మకూరు రూ.54లక్షలు, వెంకటగిరి రూ.52లక్షలు, నాయుడుపేట రూ.49లక్షల సెస్సు బకాయిలు చెల్లించాల్సి ఉంది. సెస్సు చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినా మున్సిపల్ కమిషనర్లు స్పందించకపోవడం గమనార్హం. ఈ క్రమంలో గ్రంథాలయ సంస్థలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది.



● శిథిలావస్థలో భవనం

నగరంలోని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. నూతన భవనానికి నిధులు లేకపోవడంతో అది అర్ధంతరంగా నిలిచిపోయింది. నగరంలో శాఖా గ్రంథాలయాల పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో నవతరానికి ఉపయోగపడేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దాలంటే స్థానిక సంస్థల నుంచి బకాయిలు గ్రంథాలయ సంస్థకు సకాలంలో చేరాల్సిన అవసరం ఉంది.

● అప్పులతో విజ్ఞాన తరగతులు

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల్లో జరిగిన వేసవి విజ్ఞాన తరగతులకు నిధులు లేకపోవడంతో గ్రంథ పాలకులు అప్పులు చేసి నిర్వహించారు. గ్రంథాలయ సంస్థల ఉద్యోగులకు ఏ నెలకు ఆ నెల జీతాలు వచ్చే పరిస్థితి లేదు. విశ్రాంత ఉద్యోగులకు రెండు నెలలుగా పెన్షన్ రావడంలేదు. ఆ సంస్థలో ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇంకా అందలేదు. ఈ నేపథ్యంలో బకాయిలు వసూలయ్యేలా ఉన్నతాధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.



యుద్ధం చేస్తున్న భీమ, కీచక వేషధారులు

కీచక వధ అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాలు మంగళవారం 14వరోజుకి చేరాయి. ఉదయం హోమాలు, విశేష పూజలు, చప్పర ఉత్సవం, భగవద్గీత పారాయణ జరిగాయి. సాయంత్రం విరాట్ రాజు కొలువులో పాండవులు అజ్ఞాతవాసం గడుపుతుండగా సైరంధ్రిగా పనిచేస్తున్న ద్రౌపదీ దేవిని కామంతో వేధిస్తున్న కీచక వధ అలంకా రాన్ని ప్రదర్శించారు. భీముడు, కీచకుడి వేషధారుల యుద్ధ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

వీటిని వినియోగించరా...?

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలు, రైతులతో రద్దీగా ఉండే తహసీల్దారు కార్యాలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎలాంటి పనులు సాగవు.దీంతో పనుల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి. విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగేలా ప్రభుత్వం సరఫరా చేసిన ఇన్వర్టర్లను, జనరేటర్‌ను వినియోగించే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత టీడీపీ హయాంలో సరఫరా చేసిన జనరేటర్‌కు నిర్వహణ నిధులను మంజూరు చేయకపోవడంతో దాన్ని వినియోగించడం లేదు. దీంతో అది ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టి నాశనమవుతోంది. అలాగే ఇన్వెర్టర్లు సైతం మరమ్మతులకు గురవడంతో బాగు చేయించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన ఇన్వెర్టర్లు



వినియోగంలో లేని జనరేటర్

ఉపాధి హామీలో రూ.3 లక్షల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం

అల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో రూ.3 లక్షల రూపాలయతో చేపట్టిన పను లు తేలకపోవడంతో ఆ నిధులు గోల్‌మాల్ అయినట్లు భావించి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించి సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో డీఆర్‌డీఏ పీడీ గంగాభవాని పాల్గొన్నారు. జరిగిన పనులపై సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు వివరించారు. అయితే రూ.3 లక్షల పనులకు సంబంధించిన వివరాలు సరిగా లేకపోవడంతో మళ్లీ విచారణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే రూ.20 వేల రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీవో విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎస్‌పీఎం కొండయ్య, ఎంపీడీవో రజనీకాంత్, ఈవోపీఆర్డీ వీరేంద్ర పాల్గొన్నారు.

చెరువులో కలప వేలం

కొండాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం చెరువు కట్టపై కలపకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన మంచాల కొండలరావు రూ.1.84 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నారు. నిర్ణీత కాలపరిమితిలో చెరువులో ఉండే కలపను కొట్టి విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సరుగుడు తోట దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో 4 ఎకరాల సరుగుడు తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన కె.సుబ్బరామయ్య, పులిచర్ల రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు అనే రైతులకు సంబంధించిన 4 ఎకరాల సరుగుడు తోటలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సరుగుడు తోటల్లో మంటలు వ్యాపించడాన్ని గ్రామస్థులు ఆలస్యంగా గుర్తించటంతో అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో రైతులకు రూ.10 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

క్షయ నియంత్రణకు కృషి చేయండి

నెల్లూరు (వైద్యం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు వైద్యులు, సిబ్బంది పాటుపడాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. మంగళవారం నగరంలోని కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య సేవలు అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జునైద్ సిద్దిఖీ, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ గీతాంజలి, సునీత, తిరుపతయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

న్యూస్ బాక్స్

గంధోత్సవానికి సహకరించినందుకు

ధన్యవాదాలు

- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండుగలో అతి ముఖ్య ఘట్టమైన గంధమహోత్సవం పోలీసు బందోబస్తు మధ్య గురువారం అర్ధరాత్రి వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగిందని, సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎస్పీ జి కృష్ణకాంత్ పేర్కొన్నారు. మంగళవారం రొట్టెల పండుగలో బందోబస్తును ఆయన పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనం, రొట్టెల మార్పిడికి అన్ని విధాల సహకరిస్తూ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మూడవ రోజు 42 మంది తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించామని చెప్పారు. దర్గా ప్రాంగణం, పరిసరాలు డ్రోన్ కెమెరాల నిఘా నీడలో ఉన్నాయన్నారు.

13న జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13వతేదీ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సుంకర మధు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం స్విమ్మింగ్‌పూల్‌లో జరిగే ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఎస్ఎఫ్ఐ గుర్తింపు కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఏబీవీపీ రక్తదాన శిబిరం

నెల్లూరు(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ జూలై 9న ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దేశ వ్యాప్తంగా జరుగుతాయని, దీనిలో భాగంగా శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్ సతీష్, కృష్ణచైతన్య కళాశాల డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి సుబ్బరాజు, సుకుమార్, మౌనిష్, మదన్, సుజిత్, వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ పట్టాభిరామ్ మరణం తీరనిలోటు

కావలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలకుడు, హిప్నోటిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ మరణం విజ్ఞానవంతమైన సమాజం కోరుకునే వారికి తీరని లోటని కావలికి చెందిన మెజీషియన్, కళారత్న వీ.మాధవరావు తెలిపారు. రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం రెడ్‌క్రాస్, జేవీవీ, పట్టాభిరామ్ అభిమానులు సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, జేవీవీ కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, రొటేరియన్ నల్లూరు రవికుమార్, టీంసేవియర్స్ ప్రణీత్, జేవీవీ సభ్యులు కల్లయ్య, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, జేవీవీ నేతలు

అండర్ బ్రిడ్జీల వద్ద రోడ్లను ఆధునీకరించండి: కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూలై 7,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం అండర్ బ్రిడ్జీల వద్ద రోడ్లను వెంటనే ఆధునీకరించాలని నగర కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయా వంతెనల వద్ద రోడ్లను పరిశీలించారు. ప్రజా రవాణాకు ఆటకం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా రోడ్లను బాగుచేయాలని సూచించారు. ఆ వంతెనల వద్ద వర్షాకాలం నీళ్లు నిలబడి మితిమీరిన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, రోడ్లు ఆధునీకరణతో ఆ సమస్యకు కళ్లెం వేయవచ్చని చెప్పారు. కాగా, రొట్టెల పండుగలో కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సేవలను కమిషనర్ పరిశీలించారు.



ఆత్మకూరు బస్టాండ్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

సింహపురి పులకింత

(5వ పేజీ తరువాయి)

చేసిన 9 గ్యాలరీలలోనూ రద్దీ రాత్రి 8గంటలపైన కూడా కొనసాగుతోంది. దర్గా మైదానం, స్వర్ణాల ఘాట్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు నగర పాలక సంస్థ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది, తాగునీటి సరఫరా కోసం ఇంజనీర్లు, సిబ్బంది ప్రతి క్షణంలోనూ భక్తులకు సేవలు అందించారు. అలాగే భక్తుల భద్రత కోసం పోలీసు శాఖ భక్తులతో మమే కమై సేవలు అందించారు.

● అప్యాయంగా పలకరించుకుంటూ..

స్వర్ణాల ఘాట్‌లో కోరికల రొట్టెలను హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే విధంగా రొట్టెలు మార్చుకున్నారు. సౌభాగ్య రొట్టె.. ముజేబీ దేదో బహనా అంటూ ఆప్యాయంగా మహిళలు పిలుచుకోవడం కనిపించింది. పురుషులకు రొట్టెలు ఇస్తూ ముస్లిం మహిళలు ఇచ్చాకర్నే కేలియే.. రోటీ పకడో భాయ్ అనే పిలుపులు స్వర్ణాల ఘాట్ వద్ద వీనులవిందు చేశా యి. దాదాపు వీజీపీ క్యూలైన్లతోపాటు మహిళలు, పురుషులు క్యూలైన్లు అర్ధ కి.మీకుపైగా బారులుతీరింది. బారాషహీద్ భక్త బృందం, మిత్ర బృం దం సభ్యులు భారీ స్థాయిలో వంటలు చేసి రాత్రి వరకు అందజేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ నందన్, ఇతర శాఖల ఉన్న తాధికారులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు అధికారులకు, ఉత్సవ కమిటీలకు సూచనలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు.



రొట్టెల పండుగ రద్దీతో స్తంభించిన ట్రాఫిక్

గాడిన పడుతున్న వ్యవస్థలు : రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


నెల్లూరు రూరల్ జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఆర్థిక వనరులన్నింటినీ చిన్నాభిన్నం చేసిందని, కూటమి ప్రభుత్వం కొలువుదీరాకే వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా గాడిలోకి వస్తున్నాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు. మంగళవారం నగరంలోని 30వ డివిజన్ వక్లారమ్మ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనుల కరపత్రాలు అందచేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ టీడీపీ అధ్యక్షుడు యాదయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి మన్నేపల్లి రఘు, కో క్లస్టర్ ఇన్‌చార్జి పల్నాటి మస్తాన్ నాయుడు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన మంజునాథ్(30) మంగళవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. శివాజీ యూత్ ఫౌండేషన్ సహకారంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు.



మంజునాథ్

బీసీ భవన్‌ను పూర్తిచేయించాలి

- కృష్ణయ్య యాదవ్‌కు లలితారామ్ వినతి

నెల్లూరు (వైద్యం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అసంపూర్తిగా ఉన్న పూలే బీసీ భవన్‌ను పూర్తి చేసేందుకు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య యాదవ్‌ను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వితపు లలితారాం కోరారు. మంగళవారం కృష్ణయ్యను విజయవాడలోని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. తనవంతు కృషి చేస్తానని కృష్ణయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సం ఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దువ్వూరు అరుణ, జిల్లా ఉపా ధ్యక్షుడు వేల్పుల రామ్మోహన్ యాదవ్, సోమ గోపాల్ పాల్గొన్నారు.



కృష్ణయ్యతో జిల్లా బీసీ నాయకులు



అన్నా.. మాకూ రొట్టె ఇవ్వు!



మంగళవారం తెల్లవారు జామున గుర్రంపై గంధం ఊరేగింపు





బారాషహీద్ దర్గా ప్రాంగణంలో నోరూరించే ప్రసాదాల విక్రయాలు



ఏఎస్‌పేటలో భక్తుల రద్దీ

ఏఎస్‌పేట,జూలై8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బారా షాహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్‌పేటకు భక్తుల రద్దీ పెరిగింది. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు దర్గాలోని సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్,హబీబాల సమాధుల దర్శనం కోసం బారులు తీరారు.దీంతో దర్గా ఆవరణ మంతా భక్తుతో కళకళలాడింది. భక్తులు దర్గాలోని సమాదులపై పూలు, గలేపాలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల సౌకర్యం కోసం దర్గా ఈవో హుసేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాదిగా వాహనాలు,భక్తులు రావడంతో సంగం సీఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్‌ఐ సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు.

యాత్రికులకు వైద్య ఆరోగ్య శాఖ సేవలు



రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్‌రావు

నెల్లూరు (వైద్యం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బారా షహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగలో పాల్గొంటున్న యాత్రికుల కోసం వైద్య ఆరోగ్యశాఖ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తోంది. ఇందులో మంగళవారం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్‌రావు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరం ద్వారా మూడు రోజుల్లో రెండు వేల మందికిపైగా భక్తులకు వైద్య చికిత్సలు అందించగా 8 మందిని మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరంలో డాక్టర్ తులసీ కుమారి, డాక్టర్ ఫాసిల్‌బాను, డాక్టర్ కిశోర్‌శ్రీరామ్, డాక్టర్ శిరీషా, డాక్టర్ కల్యాణి, డిప్యూటీ హెచ్‌ఈవోలు సుధాకర్‌రావు, హరిప్రసాద్, హెచ్‌ఈవోలు రవికుమార్, బ్రహ్మరెడ్డి, శశి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రొట్టెల పండుగ

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద చెరువులో మంగళవారం రొట్టెల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతోపాటు మండలంలోని దాసరిపల్లి, మాసాయిపేట, వెంగళరావునగర్, బిజ్జంపల్లి, గండిపాళెం తదితర గ్రామాలకు చెందిన హిందూ, ముస్లిం లుఅధికసంఖ్యలో పాల్గొని రొట్టెలు మార్చుకున్నారు. వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం రొట్టెలకు గిరాకీ ఏర్పడింది. ఈ సందర్భంగా పత్తర్‌ఖబర్ దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.



ఉదయగిరిలో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

పారిశుధ్యానికి ప్రాధాన్యం



రోడ్డు శుభ్రం చేస్తున్న కార్మికులు

నెల్లూరు(సిటీ), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : భక్తులు లక్షల సంఖ్యలో తరలి వస్తున్న రొట్టెల పండుగలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా కార్పొరేషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సుమారు ఆరు వేల మంది ప్రైవేట్ కార్మికులతో ఏడు జోన్లుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య అధికారి డాక్టర్ చైతన్య, సూపర్‌వైజర్లు, సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు షిఫ్ట్‌ల వారీగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ, దుర్వాసన, అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లుతున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, షవర్ల వద్ద మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచిన కార్పొరేషన్ అధికారులు అక్కడ కూడా నిత్యం పారిశుధ్య పనులు చేపడుతున్నారు.



డస్ట్‌బిన్ వద్ద బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

ప్రసన్న వేంకటేశ్వరుడి

ఆలయ హుండీ లెక్కింపు

బిట్రగుంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. దేవాదాయ శాఖ కోవూరు ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు పర్యవేక్షణలో హెచ్‌డీఎఫ్‌సీ కావలి బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థల వారు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. 110 రోజులకు స్వామి, అమ్మవార్లకు భక్తులు అందచేసిన కానుకలు రూ.17,45,900 వచ్చాయని ఈవో రాధాకృష్ణ తెలిపారు.



శ్రీవారి హుండీ లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఇండోసోల్ భూసేకరణ జీవోను ఉపసంహరించుకోవాలి



కరేడు రైతులతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకురాళ్లు లలితకుమారి, సునీత, తదితరులు

● రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకుల డిమాండ్

ఉలవపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం తలపెట్టిన బలవంతపు భూసేకరణ జీవోను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకురాలు ఎస్.లలితకుమారి, జిల్లా కార్యదర్శి జీ.సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కరేడు గ్రామాన్ని సందర్శించిన వారు గ్రామస్థులు, వ్యవసాయ కూలీలను కలిసి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ కరేడు పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల మహిళలు, రైతులు, పిల్లలు, పెద్దలు మూకుమ్మడిగా మా భూములు, ఇళ్లు వదులుకోము అని ముక్తకంఠంతో ఆందోళన చేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సమాజానికి ఆహార భద్రత సమకూర్చే రైతులను బెదిరించి బలవంతపు భూసేకరణ కోసమే రైతులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కార్పొరేట్ శక్తులకు భూ పందేరం చేసేందుకే ఈ బలవంతపు భూసేకరణకు కూటమి ప్రభుత్వం పూనుకుందని, రైతుల ఆందోళనకు రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకత్వం అండగా ఉంటుందన్నారు. రైతుల న్యాయ పోరాటంలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌యూ న్యూ నాయకులు లక్ష్మీరెడ్డి, రైతుకూలీ సంఘం నాయకులు శివరామ కృష్ణయ్య, కోడూరి కోటేశ్వరరావు, శ్రీరాములు, బక్కా శ్రీను, కరుణ, సుల్తాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహం

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందిస్తోంది. మొక్కల కొనుగోలు నుంచి ఎరువులు, అంతర పంటల సాగుతో పాటు మార్కెట్ సదుపాయం వరకు అన్నీ సౌకర్యాలు కల్పిస్తోంది. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వకపోవడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉద్యానశాఖ ద్వారా రాయితీపై మొక్కలు అందిస్తోంది. 100శాతం రాయితీ అందించడంతో జిల్లా రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి(ఫైల్)

- 100శాతం రాయితీ
- 1400 హెక్టార్లలో సాగు లక్ష్యం
- ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో పంట

నెల్లూరు(వ్యవసాయం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే వింజమూరు, దుత్తలూరు, ఆత్మకూరు, సంగం, కావలి, జలదంకి మండలాల్లో దాదాపుగా వెయ్యి హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతోంది. ఈఏడాది మరో 1400 హెక్టార్లలో పంట సాగుచేయించాలని ఉద్యానశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించి రైతు సేవా కేంద్రాల నుంచి దరఖాస్తులు కూడా తీసుకుంటున్నారు. ఒక్కో ఎకరాకి 57 మొక్కలు త్రికోణాకార పద్ధతిలో నాటుకోవాల్సి ఉంటుంది. ఈ మొక్కల సరపరాకు సంబంధించి 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ, అమ్మా పామ్ ప్లాంటేషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. ఇండిజినస్ ఆయిల్ పామ్ సాగుకు నాలుగేళ్లకు రూ.62వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్‌పామ్ సాగుకు రూ.71వేలు రైతులకు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా యాంత్రీకరణ, నీటి వసతి పరికరాలకు రూ.20వేల నుంచి రూ.1.50 లక్షల వరకు రాయితీ ఇస్తోంది. అయితే మొదటి మూడు సంవత్సరాలు పంటను పెంచేందుకు సమయం పడుతుంది. భూసారం, మొక్క ఎదుగుదలను బట్టి నాలుగో సంవత్సరం నుంచి ఫలసాయం చేతికందే అవకాశం ఉంది.

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం నూరు శాతం రాయితీ ఇస్తోంది. మార్కెట్‌లోనూ మంచి ధర పలుకుతోంది. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జెరాక్సు కాపీలతో రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న రైతులకు ఈసాగు ఎంతో లాభదాయకం.

- సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

● మార్కెట్ సదుపాయం కూడా..

ఆయిల్ పామ్ మొదటి కాపు ఎకరానికి దాదాపు 3 నుంచి 4 టన్నులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఎనిమిదేళ్ల వయసున్న తోటల్లో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లా రైతులకు మొక్కలను అందిస్తున్న సంస్థలే పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గతంలో టన్ను రూ.14వేలున్న ఆయిల్ పామ్ ధర ప్రస్తుతం రూ.17వేలకుపైగా మార్కెట్‌లో రేటు పలుకుతోంది.



బొట్టుపెట్టి ఆహ్వానం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

అమ్మా.. మీరు తప్పకుండా రావాలి... పేరంటానికి కాదండోయ్.. 'పేరెంట్స్ మీటింగ్'కి!

ఈ చిత్రంలో ఓ మహిళ ఇంకో మహిళకు బొట్టు పెడుతోంది.. ఎందుకో తెలుసా? ఆ ఏముందిలే.. గృహప్రవేశానికో, పెళ్ళికో బొట్టు పెట్టి పిలవడం సంప్రదాయం కదా.. అనుకుంటున్నారా..? అయితే.. మరి పిల్లలతో కలిసివచ్చి ఎందుకు ఆహ్వానిస్తున్నట్లు..? ఇదే కదా.. మీ డౌట్? నిజమే.. ఆమె బొట్టు పెట్టి పిలుస్తున్నది.. వాళ్లింట్లో జరిగే పెళ్లికో.. పేరంటానికో కానే కాదు! ఈనెల 10న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు కదా... అందుకే.. మంగళవారం మడమనూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులు విద్యార్థినులతో కలిసి ఇదిగో.. ఇలా ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల ఇళ్ళ వద్దకు వెళ్ళి బొట్టుపెట్టి.. లేఖలు అందించి మరీ ఆహ్వానిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సమావేశానికి అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు జరగడమే అరుదు.. అలాంటిది ఒక వేడుకలాగా.. కొత్త ఆలోచనలకు.. ఆవిష్కరణలకు నాంది పలకడం విశేషం. అభినందనీయం కూడా!

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఏకం కావాలి

● ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ

కావలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారానికి, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలన్నీ ఒక తాటిపైకి రావాలని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ పిలుపునిచ్చారు. కావలి జర్నలిస్టుక్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లా తాడేపల్లి సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 12న జరగనున్న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారన్నారు. ఆయన చేపట్టిన వర్గీకరణ పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని, ఆయన కృషి వలనే మిగతా కులాలకు కూడా ప్రయోజనం కలిగిందన్నారు. దళితుల సమస్యలకు ఉమ్మడి వేదిక ద్వారానే పరిష్కారం లభిస్తోందన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. వర్గీకరణతో మంచి జరిగిందని భావించే ఎస్సీ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. విడిపోయిన కులాలు, సంఘాలు ఒకే వేదికపైకి రావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని, సమాజంలో సామాజిక న్యాయం కోరుకునే ప్రతి ఉద్యోగి ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. వర్గీకరణకు సహకరించిన బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి కొండయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, బెజవాడ పాపయ్య, మంద వెంకటేశ్వర్లు, అక్కిలిగుంట యేసు రత్నం, గంటా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 29.417 టీఎంసీల నీరు

అనంతసాగరం జూలై 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 185 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 29.417 టీఎం సీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటిమట్టం

రాపూరు: కండలేరు పూర్తి స్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 31.397 టీఎంసీలని కండలేరు డ్యామ్ ఏఈ కే.తిరుమలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2400 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయీస్ నుంచి 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 70 క్యూసె క్కులుగా ఉందని ఆయన తెలిపారు.

రాష్ట్ర చరిత్రలో బ్లాక్ డే

ప్రసన్న క్షమాపణలు చెప్పాలి

అజీజ్, రాంభూపాల్, కోటంరెడ్డి, జెడ్‌ఎస్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్, రాంభూపాల్‌రెడ్డి, కోటంరెడ్డి, శివప్రసాద్ తదితరులు

నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్ జెడ్ శివప్రసాద్ ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలపై నీచంగా మాట్లాడటం ఒక బ్లాక్ డే అని వారు అభిప్రాయపడ్డారు. ఏ ఆడబిడ్డా ఈ వ్యాఖ్యలను సహించదని అన్నారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి వంటి వారు ప్రసన్న వ్యాఖ్యలను వారి ఇంట్లో వాళ్లకి వినిపించిన తర్వాత సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, కానీ వ్యక్తిత్వ హననం చేయడం దుర్మార్గమన్నారు. ప్రసన్న ఇంటిపై దాడికి, టీడీపీకి సంబంధం లేదని చెప్పారు. టీడీపీ నేతలు తమ కంట్రోల్‌లో ఉంటారని, కానీ ప్రసన్న ఇంటిపై దాడి చేసింది వేమిరెడ్డి అభిమానులై ఉండవచ్చునన్నారు. నీచంగా మాట్లాడితే అభిమానులు సహించరని అన్నారు. ప్రసన్న తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని, ప్రశాంతి రెడ్డికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

అలా మాట్లాడడం దారుణం : నారాయణ

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సంస్కార రహితంగా మాట్లాడటం దారుణమని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఒక ప్రకటనలో ఖండించారు. మహిళలపై నోరుపారేసుకోవడం వైసీపీ నేతలకు కొత్తేమీ కాదని, జగన్మోహన్‌రెడ్డే తన సొంత చెల్లెల్ని దుర్భాషలాడారని నారాయణ గుర్తు చేశారు. వైసీపీ అధినేత బాటలోనే వారి నాయకులు కూడా నడుస్తున్నారని విమర్శించారు. మహిళల మీద వైసీపీ నేతలకు ఎలాంటి అభిప్రాయం ఉందో మరోసారి బయటపడిందన్నారు. మహిళలను అగౌరవంగా మాట్లాడే వైసీపీ నేతలను ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలని పేర్కొన్నారు.

ఆ కుటుంబ ప్రతిష్టను మంటగల్పారు : బీద

ప్రసన్నకుమార్‌రెడ్డి తన మకిలి వ్యాఖ్యలతో నల్లపరెడ్డి కుటుంబ ప్రతిష్టను మంటగల్పారని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్య లు అత్యంత దారుణమని, వీటిని మహిళాలోకం క్షమించదని అన్నా రు. పాలనాపరంగా ప్రశాంతిరెడ్డిని విమర్శించేందుకు అవకాశం లేకపోవడంతో మతిభ్రమించి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. సాయం చేసిన వారిని తిట్టడం ప్రసన్నకు అలవాటేనన్నారు. నాడు ప్రశాంతిరెడ్డిని ఇదే ప్రసన్నకుమార్‌రెడ్డి దేవతతో పోల్చారని బీద గుర్తు చేశారు. ప్రసన్నకు ప్రజలు బుద్ధి చెప్పినా వక్ర బుద్ధి మాత్రం మారలేదంటూ దుయ్యబట్టారు.

సమాజం క్షమించదు : సోమిరెడ్డి

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే ప్రసన్న వ్యాఖ్యలను సభ్యసమాజం క్షమించదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పొదలకూరులో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లపరెడ్డి కుటుంబం పేరును భ్రష్టు పట్టిస్తున్నాడన్నారు. రాజకీయాల్లో ప్రసన్న లాంటి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదన్నారు. ఇప్పటికైనా ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీలో ఉన్నప్పుడు పొగడ్తలతో ముంచెత్తాడని, హోమాలు చేయించాడు.. దానకర్ణులని కీర్తించాడని.. ఆదర్శ దంపతులని పొగడ్తల వర్షం కురిపించాడన్నారు. ఇప్పుడేమో ఒక మహిళా ఎమ్మెల్యేని నోటికొచ్చినట్లు మాట్లాడటం చాలా దుర్మార్గమని, ప్రసన్నకుమార్‌రెడ్డి ఒళ్లు కొవ్వెక్కి మాట్లాడినట్లుగా ఉందన్నారు. షర్మిల పాదయాత్ర చేసిన సమయంలో బుచ్చిరెడ్డిపాలెం మీటింగ్‌లో చంద్రబాబును చెట్టుకు కట్టేసి కొట్టాలని మాట్లాడారన్నారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని మొదట దుర్మార్గంగా మాట్లాడారని.. ఆ తర్వాత ఆయన కాళ్లు పట్టుకుని ఆశీర్వదించమని కోరాడన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సురేంద్ర, మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, దేవినేని శరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

చేజర్ల, జూలై08 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లిలోని 132కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెల్లవారుజామున 4 నుంచి 7 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు, రైతులు సహకరించాలని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9304
వెండి కిలో ధర	రూ. 110600
వెండి ఒక గ్రాము	రూ. 113.60

శేషవాహనంపై చెన్నకేశవుడి గ్రామోత్సవం



శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడు

సంగం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడులో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూలంకరణ, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఉంచి గజమాలలతో అలంకరించారు. అనంతరం విద్యుత్‌దీపాలంకరణలో గ్రామోత్సవం నిర్వహించారు.

శ్మశానానికి భూమి కేటాయించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందచేస్తున్న గ్రామస్థులు

సంగం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాళెం పెన్నాపరివాహక ప్రాంతంలో 953 సర్వే నెంబరులో ఓ రైతు ఆక్రమిత భూమిని శ్మశానానికి కేటాయించాలని మంగళవారం పలువురు గ్రామస్థులు తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు. ఆ గ్రామానికి చెందని మణి అనే రైతు 2.86 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారని, గ్రామంలో శ్మశానం లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఆక్రమిత భూమిని శ్మశానికి కేటాయించాలని కోరారు.

ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పని చేసే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి శివకల్పన

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం అధిగమించాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత సీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై సిబ్బందిగా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నెలవారి నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

ఏఎస్ పేట,జూలై8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం తహసీల్దారు అనిల్‌కుమార్ బీఎల్‌వోలను శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్త ఓటర్ల చేర్పులు, మరణించిన ఓటర్ల తొలగింపు, సవరణలు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు.ఎప్పటికప్పుడు ప్యూరిఫికేషన్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎల్ఎంటీ రాజేంద్ర,బీఎల్‌వో లు పాల్గొన్నారు.

దత్తసాయి మందిరంలో రేపు గురుపౌర్ణమి పూజలు

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో వెలసి ఉన్న శ్రీగణేష దత్తసాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారికి కాగడా, సంధ్యా హారతి, పంచామృతాభిషేకం, నిత్య పూజలు, పల్లకీసేవ, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. భక్తులంతా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

వీటిని వినియోగించరా..?



మరమ్మతులకు గురైన ఇన్వెర్టర్లు



వినియోగంలో లేని జనరేటర్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలు, రైతులతో రద్దీగా ఉండే తహసీల్దారు కార్యాలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎలాంటి పనులు సాగవు.దీంతో పనుల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి. విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగేలా ప్రభుత్వం సరఫరా చేసిన ఇన్వెర్టర్లను, జనరేటర్‌ను వినియోగించే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత టీడీపీ హయాంలో సరఫరా చేసిన జనరేటర్‌కు నిర్వహణ నిధులను మంజూరు చేయకపోవడంతో దాన్ని వినియోగించడం లేదు. దీంతో అది ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టి నాశనమవుతోంది. అలాగే ఇన్వెర్టర్లు సైతం మరమ్మతులకు గురవడంతో బాగు చేయించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలు తెలియచేయాలి : మంత్రి ఆనం

చేజర్ల, జూలై8 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ విజయాలను తెలియజేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రాయనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెరుమాళ్ళపాడు సమీపంలో గల ఫాంహౌస్‌లో పార్టీ మండల కన్వీనర్లు, కోఆర్డినేటర్లకు మై టీడీపీ యాప్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని తెలుసుకుని, ఉంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.అనంతరం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి వెళ్లారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చెరు కూరు వీరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ప్రమాదబీమా పత్రాలను ఆయన భార్య చెరుకూరు నూర్జహాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తూర్పుకంభంపాడులో కూడా సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు అన్నలూరు శ్రీనివా సులునాయుడు, కొమ్మి రమేష్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి రాబోయే కాలంలో పార్టీ చేపట్టబోయే పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నలబోతు శివకృష్ణ, హరీష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చేజర్ల : మై టీడీపీ యాప్‌పై దిశానిర్దేశం చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు : కరటంపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

● **ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా వారు మంగళవారం మండలంలోని కరటంపాడు ఎస్టీ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సోమశిల ఉత్తర కాలువ వైస్‌చైర్మన్ పూనుగుంట ధనుంజయ్, సర్పంచి పూనుగుంట రేవతి, టీడీపీ నాయకులు హనీఫ్, హుస్సేన్, పీ శ్రీరాములు, సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి టీడీపీ ప్రభుత్వం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతుల పక్షపాతి టీడీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని నందిగుంటలో కోట ఎరుకులరెడ్డి పొలంలో మంగళవారం ఎమ్మెల్యే, ఏపీ డీ.మృదుల, స్థానిక నాయకులతో కలిసి పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దీర్ఘకాలిక పంటలపై ఉపాధి హామీ ద్వారా ప్రోత్సాహాలు అందిస్తున్నారని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్కరోజే 150 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడా నరసారెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, వనిపెంట సుబ్బారెడ్డి, ఆనంగి రమణయ్య, జయంత్‌రెడ్డి, సర్పంచి ఖాజారెడ్డి, ముంతా శ్రీనివాసులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ఉదయగిరి : ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్. బయ్యన్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణంపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. క్రార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, గడ్డం వెంకటేశ్వర్లు, జీసీ రమణారెడ్డి, మట్ల నాగయ్య, అక్కి సుబ్బారెడ్డి, అలా రమేష్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపులపై దాడులు

ఉదయగిరి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై సీఐ లక్ష్మణస్వామి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో మద్యం విక్రయాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆయన తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఉదయగిరి మండలంలోని కృష్ణంపల్లిలో 8, దుత్తలూరు మండలం నందిపాడులో 7, సీతారామపురం మండలం అయ్యవారిపల్లిలో 10 చొప్పున మొత్తం 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారయత్నం చేసిన కేసులో నిందితుడిగా ఉన్న దుత్తలూరు మండలం నందిపాడు ఎస్సీ కాలనీకి చెందిన బక్కా ప్రకాష్‌కు 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆటో నడిపే ప్రకాష్ 2014లో ఉదయగిరి మండలం కుర్రపల్లికి చెందిన ఓ మహిళపై అత్యాచారయత్నం చేశాడు. అప్పట్లో కేసు నమోదు కాగా 2018 నుంచి ప్రకాష్ కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా ఊరి నుంచి వెళ్లిపోయాడన్నారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి మంగళవారం అతన్ని అదుపులోకి తీసుకుని 8వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు.. తాగునీటికి కష్టాలు

ఉదయగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నెల రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం గ్రామస్థులు వాపోయారు. గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మూడు మోటార్లు ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్నాయన్నారు. నెల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో తాగునీటి కష్టాలు తప్పడంలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి కష్టాలు తీర్చాలని వారు కోరారు.

నెలాఖరుకు ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు



డ్రోన్ పరికరం అందజేస్తున్న జిల్లా అధికారిణి సత్యవాణి

అనంతసాగరం జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల చివరి వారంలో అన్నదాత సుఖీభవ నగదు రైతులకు ఖాతాల్లో జమ అవుతుందని జిల్లా వ్యవసాధికారిణి సత్యవాణి తెలిపారు. మంగళవారం ఆమె అనంతసాగరం వ్వయసాయ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్సిడీ ద్వారా డ్రోన్ పొందిన రైతుకు పరికరం అందజేశారు. డ్రోన్ యంత్రం పనిచేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి రైతు అన్నదాత సుఖీభవ సైట్‌లో పేరు ఉందో, లేదో రైతు సేవాకేంద్రాల్లో చూసుకోవాలని కోరారు. లేని వీఏఏలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు నరసోజీరావ్, ఏవో శైలజాకుమారి పాల్గొన్నారు.

● **ఆత్మకూరు** : అన్నదాత సు ఖీభవ పథకం లబ్ధికి రైతులంతా తప్పనిసరిగా ఈకే వైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశా ఖాధికారి కే.కిశోర్‌బాబు తెలిపారు. మండలంలోని చెర్లోయడవల్లి, మురగళ్ల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిసుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా రైతు భరోసా సేవా కేంద్రాలకు వెళ్లి రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు బీ. శ్రీహర్ష, వీ. ప్రత్యూష, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

● **సంగం** : మండలంలోని రైతులు పంటల బీమా చేయించుకోవాలని కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత కోరారు. మంగళవారం ఆమె వ్యవసాయాధికారి శశిధర్‌తో కలిసి మండలంలోని అన్నారెడ్డిపాళెం, దువ్వూరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని వరి సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట రుణం తీసుకోని రైతులు వరి పంట కు రైతు వాటా ఎకరానికి రూ. 840లు, వేరుశనగకు ఎకరానికి రూ. 280లు చొప్పున సీఎస్‌సీ సెంటర్‌లో సంప్రదించి టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్‌లో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి** : పంటల సా గులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి విజ యభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని అప్పసముద్రం, గుడినరవ రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో వినోద్, వీహెచ్‌ఏ శేఖర్, వీఏఏ రహంతుల్లా, రైతులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు** : మండలంలోని సోమలరేగడ, దుత్తలూరు-2 రైతుసేవా కేంద్రాల పరిధిలో మంగళవారం మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సుస్మిత, వీఏఏలు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్ఆర్ జయంతి



అనంతసాగరం : అన్నదానం చేస్తున్న వైసీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, అల్లారెడ్డి ఆనందరెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారంలో మంగళవారం దివంగత సీఎం వైయస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు అక్కలరెడ్డి భాస్కర్‌రెడ్డి, అక్కలరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారీగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బీ. పిచ్చిరెడ్డి, బీ. జనార్దన్‌రెడ్డి, ఎద్దుల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగం,(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాలచంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నెల్లూరు కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

● **దాడులు హేయమైన చర్య**

ఉదయగిరి, జూలై 8: అధికారం ఉందనే అహంకారంతో టీడీపీ శ్రేణులు వైసీపీ నాయకులపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక ఆనకట్ట సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. కక్షసాధింపు చర్యలు పాల్పడితే అనంతరం వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, అలీఅహ్మద్, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, గానుగపెంట శ్రీనివాసులరెడ్డి, గొల్లపల్లి తిరుపతి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైసీపీ నేతలు

C.R.I.M.E N.E.W.S

ఏలూరుపాడులో రెండిళ్లలో చోరీ



ఏలూరుపాడులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

గుడ్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరుపాడులో సోమవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన నాగసూరి మురళీకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం నాగూర్‌నాగపట్నంకు బయలుదేరి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరనిది గ్రహించిన గుర్తుతెలియని దుండగులు అదే రోజు రాత్రి ఆ ఇంట్లోకి జొరబడి బీరువాలో దాచుకున్న అరకేజీ వెండి, రెండున్నర సవర్ల బంగారంతోపాటు రూ.70 వేల అపహరించుకెళ్లారు. అలాగే మురళీకృష్ణ ఇంటి పక్కన నివాసం ఉండే చేవూరి శ్రీనయ్య కూడా సొంత పనుల నిమిత్తం కొద్ది రోజుల క్రింత హైదరాబాద్ వెళ్లగా అతని ఇంట్లోకి ప్రవేశించి రెండున్నరసవర్ల బంగారం, రూ.17 వేల అపహరించుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న రెండు కుటుంబాల బాధితులు వారి బంధువుల ద్వారా ఇళ్లల్లో ఉంచిన నగదు, బంగారు వివరాలు చెప్పి చూడమనగా అవి లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ చోరీపై సమచారం అందుకున్న ఎస్ఐ వెంకట్రావు సంఘటన స్థలానికి చేరుకొని, దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటారు బైక్ బోల్తా

●యువకుడికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలైన యువకుడిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

సంగం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరుణవాయి క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం సాయంత్రం మోటారు బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు... ఆత్మకూరు నుంచి మోటారు బైక్‌పై నెల్లూరు వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన మైలురాయిని ఢీకొట్టి మోటారుబైక్‌తోపాటు యువకుడు పొలాల్లో పడ్డాడు. దీంతో ఆ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న ఆత్మకూరు సీఐ గంగాధర్ గమనించి వాహనాన్ని నిలిపి బాధితుడ్ని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆ యువకుడు అపస్మారక స్థితిలో ఉన్నందున పూర్తి వివరాలు తెలియరాలేదు.

తూ.కొ అధికారుల దాడులు

● 8 దుకాణాలపై కేసుల నమోదు



కలిగిరిలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కలిగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణంలో మంగళవారం తూనికలు-కొలతలు శాఖ అధికారులు పలుషాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 దుకాణాల్లో కొలతలు తేడాపై కేసులు నమోదు చేసి రూ.24వేలు అపరాధ రుసుం విధించినట్లు కావలి డివిజన్ లీగల్ మెటాలజీ ఇన్‌స్పెక్టర్ షేక్ మోషిన్ తెలిపారు. దుకాణదారులు వస్తువుల తూకం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్యాకింగ్ వస్తువులు నూనెలు, పప్పుదినుసులు, బియ్యం వంటి సరుకులు ప్యాకెట్‌పై ముద్రించి ఉన్న పరిమాణానికి తేడా ఉండకూడదన్నారు. ప్రజలు తాము కొనుగోలు చేసే సరుకుల పట్ల ప్యాకింగ్, గడువు తేదీలను సరిచూసుకొని వస్తువులను కొనుగోలు చేసుకోవాలన్నారు. ఏదైనా దుకాణాల్లో తేడాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చికిత్స పొందుతూ ఆటో యూనియన్ అధ్యక్షుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జొన్నవాడకు చెందిన బుచ్చి ఆటో యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షుడు పాశం రాజయ్య, (59) చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు, మంగళవారం జొన్నవాడలో జరిగిన రాజయ్య అంత్య క్రియల్లో జిల్లా యూనియన్ నాయకులు కోలగట్ల సురేష్, మారుబోయిన వెంకట రాజ, చల్లకొలుసు మల్లికార్జున, మునీర్ అహ్మద్, సీపీఎం, సీఐటీయూ నాయకులు వెంకమరాజు, గుర్నాధం, శ్రీనివాసులు, ఎం. సురేష్, మాధవ్, టి. రమణయ్య, కే. వెంకటరమణయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు. రాజయ్య యూనియన్ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. రాజయ్య మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

ఇద్దరు యువకుల ఆత్మహత్య

● అనారోగ్యంతో ఒకరు..

● ఉద్యోగం రాలేదని మరొకరు బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఒకరు, ఉద్యోగం రాలేదని మరొకరు ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలపై వేదాయపాళెం పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని డ్రైవర్స్ కాలనీలో శైలజ, శివకోటాచారి దంపతులు నివసిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు మంజునాథ్ (25) కొయ్యపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకుంటున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్తాపం చెందాడు. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట శైలజ, శివకోటాచారి చెన్నైలోని కుమార్తె ఇంటికి వెళ్లగా మంజునాథ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. పక్కింటి వారి ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● నగరంలోని బీవీనగర్ రామకృష్ణానగర్‌లో లలిత కుటుంబం నివసిస్తోంది. ఆమె కుమారుడు దీపక్(24) బీటెక్ చదువుకుని ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఉద్యోగం రాలేదని తరచూ బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు కాలువలో మృతదేహం

నెల్లూరు రూరల్. జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని జొన్నవాడ సర్కిల్ వద్ద నెల్లూరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. మంగళవారం స్థానికుల సమాచారంతో ఘటన స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. 40 ఏళ్ల వ్యక్తి మరణించి 5-6 రోజులు అవుతోందని తెలిపారు. జీజీహెచ్ మార్చురీకి మృతదేహాన్ని తరలించామని, గుర్తించిన వారు రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570

ఉపాధి హామీలో రూ.3 లక్షల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం

అల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో రూ.3 లక్షల రూపాలయతో చేపట్టిన పనులు తేలకపోవడంతో ఆ నిధులు గోల్‌మాల్ అయినట్లు భావించి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించి సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో డీఆర్‌డీఏ పీడీ గంగాభవాని పాల్గొన్నారు. జరిగిన పనులపై సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు వివరించారు. అయితే రూ.3 లక్షల పనులకు సంబంధించిన వివరాలు సరిగా లేకపోవడంతో మళ్లీ విచారణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే రూ.20 వేల రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీవో విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎస్‌పీఎం కొండయ్య, ఎంపీడీవో రజనీకాంత్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పేద మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ కె.అనూష మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఆమె వెంట కల్లూరి శైలజ, ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మేక్ ఏ ఛేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని మాల్యాద్రి కాలనీ ప్రాథమిక పాఠశాల, విక్కిరాలపేట హెచ్‌పీ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం ప్లేట్లు, వాటర్‌బాటిల్స్, నోట్ పుస్తకాలు, బోధనా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌతమ్, శివతేజ, స్రవంతిలతో పాటు రవ్వా శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జె. పద్మ, షేక్ బుడేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసత్తా మండల మహిళా కమిటీ ఏర్పాటు

బిట్రగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల ప్రజాసత్తా మహిళా నూతన కమిటీ ఏర్పాటు జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది, మండల మహిళ అధ్యక్షురాలిగా పందిళ్ల సునీత, ఉపాధ్యక్షురాలు వేదగిరి సుహాసిని, కార్యదర్శి రాచూరు శివప్రియ, సహాయక కార్యదర్శి పిడుగు కవిత, కోశాధికారిగా కండ్లగుంట నిర్మల, కన్వీనర్ బిజ్జం పద్మ, కో కన్వీనర్ అమ్ములు జలిని ఏకగ్రీవ ఎంపిక చేసినట్లు ప్రజాసత్తా రాష్ట్ర కన్వీనర్ చింతల దయాకర్ తెలిపారు.

346 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 08(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 501పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 346 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-121, ఆర్‌ఆర్-5, సీఆర్-28, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 155బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.197.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

జువ్వలదిన్నెలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

బిట్రగుంట, జూలై 8(ఆంధ్రజ్యోతి): జువ్వలదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు టీ.వెంకయ్య డిమాండ్ చేశారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో మంగళ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు తీరప్రాంత గ్రామమైన జువ్వలదిన్నెలో పీహెచ్‌సీ ఏర్పాటుతో చుట్టుపక్కల సుమా రు 17 గ్రామాలకు చెందిన దాదాపు 5000 మందికి పైగా వైద్య సేవలు అందించవచ్చన్నారు.

నేడు మండల సమావేశం

కలిగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మెట్టుకూరు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

పశువైద్యం దైన్యం!

- శిథిలావస్థలో వైద్యశాల భవనాలు
- వేధిస్తున్న పశువైద్యుల కొరత
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల

వలేటివారిపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. ఓపక్క పశువైద్యుల కొరత వేధిస్తుండగా మరోపక్క వైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరి దైవాధీనంగా ఉన్నాయి. దీంతో పాడి రైతులు సకాలంలో పశు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలు ఉన్నాయి. వలేటివారిపాలెం మండలంలోని పోకూరు, లింగసముద్రం మండలంలోని వీఆర్‌కోట, లింగసముద్రం పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోకూరుతో పాటు లింగసముద్రం ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా ఉన్న పులి వంశీ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రకాశ జిల్లా తూర్పు గంగవరం పశువైద్యశాలకు బదిలీ అయ్యారు. వీఆర్‌కోట పశువైద్యాధికారి శ్రీకాంత్ కందుకూరు మండలం కోవూరు పశువైద్యాధికారిగా బదిలీ అయ్యారు. దీంతో పోకూరు, లింగసముద్రం, వీఆర్‌కోట పశువైద్యుల పోస్టులు ఖాళీ అయ్యాయి. పోకూరు ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా కందుకూరు మండలం మాచవరం పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా లింగసముద్రం, వీఆర్‌కోట ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా చినపవని రెగ్యులర్ పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయా పశువైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. ఓ పక్క పశువైద్యులు లేక మరో పక్క సరిపడు వసతుల లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు.

● శిథిలావస్థకు పశువైద్యశాల భవనం

మండలంలోని పోకూరు పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం లోపల భాగంలో స్లాబు పెచ్చులూడిపోయి వర్షం నీరు భవనంలోకి వచ్చి చేరుతుంది. దీంతో పశువుల మందులు తడిచిపోతున్నాయి. అంతేగాకుండా మహిళా పశువైద్య సిబ్బందికి మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటి కీ పట్టించుకునేవారు లేరు. పశువైద్యశాల భవనం పునఃనిర్మాణానికి, వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించి ఏడాది కావస్తోంది. అయినప్పటికీ ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో వసతులు లేక వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● స్థాయి పెంచారు.. వసతులు మరిచారు

వలేటివారిపాలెం పశువైద్యశాలను ఐదారేళ్ల క్రితం ప్రాంతీయ పశువైద్యశాలగా స్థాయిని పెంచారు. ఇప్పటి వరకు అందుకువగ్గట్లు వసతులు మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రాంతీయ పశువైద్యశాలకు స్టోర్ రూము, రికార్డు రూము, ఏడీ రూము, మీటింగ్ హాలు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలి. అయితే ఆ దిశగా వసతులు లేవు. దీంతో సమావేశం సందర్భంలో సిబ్బంది, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యులు లేరు.. వసతులు లేవు



వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని పోకూరు, లింగసముద్రం, వీఆర్‌కోటలో పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నాం. పోకూరు పశువైద్యశాల భవనం పునఃనిర్మాణానికి, మరుగుదొడ్లు తదితర వసతులకు ప్రతిపాదనలు పంపించాం. వలేటివారిపాలెంలో ప్రాంతీయ పశువైద్యశాల స్థాయికి తగ్గట్లుగా వసతులు లేవు. వసతులు కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ చెన్న కేశవులు, ఏడీ, వలేటివారిపాలెం

గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభం



ఓంకారం ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు, భక్తులు

కావలి(టౌన్), జూలై 8(ఆంధ్రజ్యోతి): ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసిన శ్రీసాయి క్షేత్రంలో మంగళవారం గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీ సాయి క్షేత్రం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం ఉదయం కాకడ హారతి అనంతరం ఓంకార ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర నామార్చన, మధ్యాహ్న హారతి, ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లింగసముద్రంలో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని మీసేవా కేంద్రం వద్ద పగిలిన మంచినీటి పైపులన్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మరమ్మతులు చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన మడుగు కాదు.. రోడ్డే వార్తకు ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారులు స్పందించారు. ఉదయం ఎక్స్‌కవేటర్‌తో బురద మట్టిని తీసివేసి, పగిలిన మంచినీటి పైపులైన్‌ను తొలగించి కొత్త పైపులైన్ వేశారు. అనంతరం మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో లింగసముద్రం ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



రీసర్వేలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

● లక్ష్మీనారాయణ, తహసీల్దారు, అల్లూరు.

ముఖాముఖి

అల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో ఏర్పడిన భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాం. మండలంలోని గోగులపల్లి రెవెన్యూలో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కరించాం. ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు.

? అన్ని గ్రామాల్లో రీసర్వే చేపట్టారా.

! మండలంలో అల్లూరు, అల్లూరు పేట, సింగపేట గ్రామాల్లో రీసర్వే జరగలేదు. వీటిని రీసర్వే చేపట్టాలంటే దాదాపు 20 సర్వే టీమ్‌లు అవసరం. మరో నెలరోజుల్లో సింగపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములకు రీసర్వే ప్రారంభిస్తాం.

? రీసర్వేలో ఏర్పడిన భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! రీసర్వేలో ఏర్పడిన భూ సమస్యలను అనుకున్న మేరకు కాకపోయినా వీలైనన్ని పరిష్కరిస్తున్నాం. అత్యధికంగా మండలంలోని గోగులపల్లి పంచాయతీలో సమస్యలు ఉన్నందున కావలి ఆర్డీవో పర్యవేక్షణలో ఒక రోజు గ్రామసభ ఏర్పాటు చేసి వీలైనన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

? నీటి తీరువా బకాయిలు ఎంత ఉన్నాయి. వసూలు చేస్తున్నారా.

! మండలంలో నీటితీరువా రూ.1.80 కోట్లు డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు రూ.40 లక్షలు వసూలు చేశాం. మిగిలిన రూ.1.40 కోట్ల వసూళ్లకు ఆన్‌లైన్ ప్రక్రియ ఆగినందున ఆలస్యమైంది. త్వరితగతిన వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

అట్టహాసంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



కావలి : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమర్ రెడ్డి, తదితరులు

కావలి(టౌన్), జూలై 8(ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో అట్టహాసంగా జరిగాయి. ట్రంకురోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేయగా నేతలు, అభిమానులు ఆయనకు తినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : స్థానిక వైసీపీ కార్యాలయలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వైసీపీ మండల అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకు వెంకటస్వామి, నల్లమోతు చంద్రమౌళి, నాగిరెడ్డి శివరామిరెడ్డి, పొట్టేళ్ల కృష్ణయ్య, చింతలపూడి రవీంద్ర, కట్టా హనుమంతరావు, గుత్తా గోపి, తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : బోగోలు మండల వైసీపీ అధ్యక్షుడు ఎం.వీరరఘు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయింతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ ఎం.సుజాత, జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీ ఎం.పద్మమ్మలు కేక్‌కట్ చేశారు. అనంతరం బజారు కూడలలోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీ.సులోచనమ్మ, అంకులయ్య, ఎం.సాల్మన్‌రాజు, శ్రీనివాసులు, ఏకే జసుందర్‌రాజ్, గిరిబాబు, మల్లారెడ్డి, నవాజ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం : స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ఎదురుగా ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పేదలకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, నాయకులు పీ తిరుపతిరెడ్డి, దగ్గు వెంకటేశ్వర్లు, చీమల శ్రీనివాసులు, షేక్ షఫి, సూరం కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● అల్లూరు : స్థానిక పాతబస్టాండు కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, నీలం సాయికుమార్, మేడా మాధవ, బీద రమేష్, మోమిడి మాధవరావు, ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ పట్టాభిరామ్ మరణం తీరనిలోటు



పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, జేవీవీ నేతలు

కావలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలకుడు, హిప్నోటిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ మరణం విజ్ఞానవంతమైన సమాజం కోరుకునే వారికి తీరని లోటని కావలికి చెందిన మెజీషియన్, కళారత్న వీ.మాధవరావు తెలిపారు. రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం రెడ్‌క్రాస్, జేవీవీ, పట్టాభిరామ్ అభిమానులు సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, జేవీవీ కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, రొటేరియన్ నల్లూరు రవికుమార్, టీంసేవియర్స్ ప్రణీత్, జేవీవీ సభ్యులు కల్లయ్య, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలు ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సుధాకర్

వలేటివారిపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి) : ఎస్టీల పిల్లలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో సుధాకర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకూ ఎస్టీల పిల్లలకు ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పుట్టినబిడ్డ నుంచి 6 ఏళ్ల వయస్సు లోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రంలో పేరు కలిగిన పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, ఈవోఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లూరు, (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యువత అభివృద్ధి కోసం ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఇస్కపల్లి సచివాలయ ప్రాంగణంలో మంగళవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ డీఈఏ ఫండ్ సహకారంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ చేపట్టిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా యువతకు అనేక రుణపథకాలను ప్రవేశపెడుతుందన్నారు. సీఎఫ్ఐ కౌన్సిలర్ సయ్యద్ నయాబ్ బాషా మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ మేనేజరు గౌతమ్, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చుండిలో ఇంటింటికి కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

వలేటివారిపాలెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని కందుకూరు నియోజకవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కామినేని అశోక్ తెలిపారు. మండలంలోని చుండిలోని 11వ బూత్‌లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వం ఈ ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చొప్పర రాఘవులు, మేకల అశోక్, కామినేని అనిల్, కామినేని వీరయ్య, కామినేని బాలకృష్ణ, చొప్పర మాల్యాద్రి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 4 ఎకరాల సరుగుడు తోట దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో 4 ఎకరాల సరుగుడు తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన కె.సుబ్బరామయ్య, పులిచర్ల రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు అనే రైతులకు సంబంధించిన 4 ఎకరాల సరుగుడు తోటలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సరుగుడు తోటల్లో మంటలు వ్యాపించడాన్ని గ్రామస్థులు ఆలస్యంగా గుర్తించటంతో అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో రైతులకు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

మాదిగ జాతికి దేవుడిచ్చిన వరం మంద కృష్ణ

● ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కావలి(టౌన్), జూలై 8(ఆంధ్రజ్యోతి) : మాదిగ జాతికి దేవుడిచ్చిన వరం మంద కృష్ణమాదిగ అని ఎంపీడీవో చేవూరు శ్రీదేవి అన్నారు. మంగళవారం అరుంధతీపాలెంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, కృష్ణమాదిగ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మార్పీఎస్ జెండాను ఎంపీడీవో ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు చేవూరు మాల్యాద్రి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ నేత కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మంద వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి కొండయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు జీ.వెంకటేశ్వర్లు, సుకుమార్, సురేంద్ర, దేవకుమార్, నాయబ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

చెరువులో కలప వేలం

కొండాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం చెరువు కట్టపై కలపకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన మంచాల కొండలరావు రూ.1.84 లక్షలకు కలపను కొట్టుకునేందుకు దక్కించుకున్నారు. నిర్ణీత కాలపరిమితిలో చెరువులో ఉండే కలపను కొట్టి విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సింహపురి పులకింత

(5వ పేజీ తరువాయి)

చేసిన 9 గ్యాలరీలలోనూ రద్దీ రాత్రి 8గంటలపైన కూడా కొనసాగుతోంది. దర్గా మైదానం, స్వర్ణాల ఘాట్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు నగర పాలక సంస్థ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది, తాగునీటి సరఫరా కోసం ఇంజనీర్లు, సిబ్బంది ప్రతి క్షణంలోనూ భక్తులకు సేవలు అందించారు. అలాగే భక్తుల భద్రత కోసం పోలీసు శాఖ భక్తులతో మమేకమై సేవలు అందించారు.

● ఆప్యాయంగా పలకరించుకుంటూ..

స్వర్ణాల ఘాట్‌లో కోరికల రొట్టెలను హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే విధంగా రొట్టెలు మార్చుకున్నారు. సౌభాగ్య రొట్టె.. ముజేబీ దేదో బహనా అంటూ ఆప్యాయంగా మహిళలు పిలుచుకోవడం కనిపించింది. పురుషులకు రొట్టెలు ఇస్తూ ముస్లిం మహిళలు ఇచ్చాకర్నే కేలియే.. రోటీ పకడో భాయ్ అనే పిలుపులు స్వర్ణాల ఘాట్ వద్ద వీనులవిందు చేశాయి. దాదాపు వీజీపీ క్యూ లైన్లతోపాటు మహిళలు, పురుషులు క్యూలైన్లు అర్థ కి.మీకుపైగా బారులు తీరింది. బారాషహీద్ భక్త బృందం, మిత్ర బృందం సభ్యులు భారీ స్థాయిలో వంటలు చేసి రాత్రి వరకు అందజేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ నందన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు అధికారులకు, ఉత్సవ కమిటీలకు సూచనలు ఇస్తూ అప్రమత్తం చేశారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలు హేయం



కావలి : మాట్లాడుతున్న బీజేపీ నేత భరత్‌కుమార్

జలదంకి, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు హేయమని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు మంగళవారం ఒకప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళ అని కూడా చూడకుండా సంస్కారహీనంగా మాట్లాడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు మహిళలంటే చులకన భావం అని, అధికారంలో ఉండగా అలానే వ్యవహరించారని, ప్రతిపక్షంలో కూడా వారి తీరుమారలేదని పేర్కొన్నారు. ఇకనైనా తీరుమార్చుకొని రాజకీయాల్లో కొనసాగాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే, ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై మండల టీడీపీ నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎలాంటి అవినీతి మచ్చలేని వేమిరెడ్డి దంపతులను ఎదుర్కోలేక ప్రసన్న వ్యక్తిగత విమర్శలకు దిగడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు.

అలజడి సృష్టించటానికే...

కావలి : ప్రశాంతమైన జిల్లాలో అశాంతిని నెలకొల్పి అలజడలు సృష్టించి కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలనే కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అనుచిత వాఖ్యలు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాంలడుతూ రాష్ట్రంలో అలజడిలు సృష్టించి భయానక వాతావరణం కల్పించడానికి వైసీపీ నేతలు తాపత్రయపడుతున్నారన్నారు. అందుకు ప్రసన్న చేసిన వాఖ్యలే నిదర్శనమన్నారు. మహిళలను కించపరచటం, వారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం వైసీపీ నేతలకు పరిపాటిగా మారిందని ఇలాంటి వారిపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు వస్తాయన్నారు. రాజకీయ విమర్శలు చేయాలే కాని వ్యక్తిగతంగా మహిళా శాసన సభ్యురాలుపై సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం ప్రన్నకు తగదన్నారు ఈ మధ్యకాలంలో జగన్మోహన్‌రెడ్డి ఎక్కడ పర్యటించినా అక్కడ గొడవలు చేయటం, శాంతిభద్రతలకు విఘాతం కల్పించటం ఒక పథకం ప్రకారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు మంద కిరణ్‌కుమార్, పరుసు వెంకటేశ్వర్లు, వాయిగండ్ల వెంకటసుధీర్, కూరాకుల సవీంద్ర, మురళీ, కృష్ణ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసన్న వ్యాఖ్యలు దురదృష్టకరం

కొండాపురం : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు హేయమని జిల్లా టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనూష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలను ఎంతో గౌరవిస్తుంటే వైసీపీ నేతలు మాత్రం ఇప్పటికీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయం మానుకొని వ్యక్తిగత దూషణలకు పాల్పడటం దారుణమని తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేద, బడుగు బలహీనవర్గాలను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆమె ఆత్మ గౌరవాన్ని కించపరచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆ విధంగా మట్లాడిన ప్రసన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 9 జూలై 2025



మామిడి రకాలెన్నో తెలుసుకో

ముందు మామిడిలో రకాలెన్నో తెలుసుకో. వాటిలో కనీసం నాలుగు పేర్లయినా తెలుసుకుని ఆ తర్వాత మామిడి రైతులను పరామర్శించేందుకు రా. సీఎంగా ఐదేళ్లలో ఏ రోజైనా మామిడి రైతుల గురించి మాట్లాడావా? ఇప్పుడు దండయాత్రలాగా రావడమేమిటి? పొగాకును తొక్కినట్టు మామిడి పండ్లను తొక్కేస్తావా? జగన్ పర్యటనకు 500 మందిని అనుమతించడమే చాలా ఎక్కువ.

- భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నేత, టీటీడీ సభ్యుడు

జగన్.. మీ నేతల ఫ్యాక్టరీకి వెళ్లు

మామిడికి మార్కెట్‌లో డిమాండు ఎందుకు తగ్గిందనేది మీ నేతల గుజ్జు ఫ్యాక్టరీల వద్దకెళ్లు. వారిని అడిగి తెలుసుకో. పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్, వైసీపీ నేతలకు సంబంధించిన సీజీఆర్ ఫుడ్స్, టాస్ తదితర పరిశ్రమలు మామిడి పండ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదో వారిని అడుగు. అంతేగాని పరామర్శ పేరిట రైతులపైకి దండయాత్ర చేస్తాననడం సరికాదు.

- నీలాయపాళెం విజయకుమార్, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్



- గతంలో జరిగిన విషాదాల నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు
- అనుమతుల్లేకపోయినా బలప్రదర్శనకు సిద్ధమవుతున్న వైసీపీ
- పోలీసుల అనుమతి 500 మంది.. వైసీపీ టార్గెట్ 30 వేలు..
- ఇప్పటికే బంగారుపాళ్యంలో 600 మంది పోలీసులు, అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులు
- మాట వినకుంటే అత్యంత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధం



బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలో జాతీయ రహదారి పక్కన వైసీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

జగన్ పర్యటన.. ఉత్కంఠ

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పోలీసుల ఆంక్షలు. మరోవైపు వీటిని ధిక్కరించేలా వైసీపీ ప్రయత్నాలు. దీంతో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బుధవారంనాటి బంగారుపాళ్యం పర్యటన ఒకరమైన ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల జగన్ పర్యటించినప్పుడు అక్కడ సంభవించిన మరణాలు, ప్రమాదాల నేపథ్యంలో పోలీసులు ఆంక్షల్ని విధించారు. పూతలపట్టు ఇన్‌చార్జి సునీల్ ఇచ్చిన అర్జీ మేరకు ఎస్పీ మణికంఠ 500 మందికి అనుమతి ఇచ్చారు. అనుమతుల్ని ఖాతరు చేయని వైసీపీ నాయకులు పెద్దఎత్తున జనాల్ని తరలించేందుకు సిద్ధమయ్యారు. మండలానికి వెయ్యి చొప్పున 30వేల మంది టార్గెట్ పెట్టుకున్నా.. 10వేల మంది వస్తారని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని పోలీసులతో పాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున పోలీసులు మంగళవారమే బంగారుపాళ్యం చేరుకున్నారు. సుమారు 600 మంది పోలీసులు బంగారుపాళ్యంలో ఉన్నారు. ఎస్పీ మణికంఠ, డీఎస్పీ తదితర అధికారులు మంగళవారం బంగారుపాళ్యంలో పర్యటించి.. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హెలిప్యాడ్ వద్ద 30మంది, మార్కెట్ యార్డులో 500 మందికి మించి అనుమతించకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే బంగారుపాళ్యం వచ్చే అన్ని హైవే, గ్రామీణ మార్గాల్లో పెద్దఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశారు. ఆయామార్గాల నుంచి వచ్చే వాహనాలను అక్కడే అడ్డుకుంటారు. ఆర్టీసీ బస్సుల్ని సైతం తనిఖీలు చేయనున్నారు. చెక్‌పోస్టుల్లో ప్రజల్ని వెనక్కి వెళ్లిపొమ్మని చెప్తారు. మాట వినకుంటే అత్యంత కఠినంగా వ్యవహరించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన జగన్ పర్యటనల్లో వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ఘర్షణలు చేశారని, బంగారుపాళ్యంలో కూడా అలాంటి పనులు చేసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లోని పర్యటనలో చోటు చేసుకున్న సంఘటనలు బంగారుపాళ్యంలో రిపీట్ అవ్వకుండా గట్టిగా వ్యవహరించేందుకు సమాయత్తంగా ఉన్నారు. బారికేడ్లను తోసుకుని వస్తాం, మాట వినకుండా చెక్‌పోస్టులను దాటేస్తాం అనేవారి పట్ల పోలీసులు తీవ్ర చర్యలు తీసుకునే అవకాశముంది.

జగన్ పర్యటన ఇలా

బెంగళూరులోని జకూర్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.50 గంటలకు బంగారుపాళ్యం మండలం కొత్తపల్లె వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ్నుంచి కారులో 11.20 గంటలకు మ్యాంగో మార్కెట్‌కు చేరుకుని గంటపాటు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 12.35 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

'రాజకీయ లబ్ధి కోసమే పర్యటన'

బంగారుపాళ్యం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధికోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంలో పర్యటిస్తున్నారని, ఆయన పర్యటనతో రైతులకు ఎలాంటి లాభం లేదని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో మామిడి మండీ యజమానులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకునేందుకు అనేక ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 6.50 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.4 సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను ఒప్పించి తోతాపురి మామిడి కాయలను కొనడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. వైసీపీ నాయకులకు చెందిన గుజ్జు పరిశ్రమ యాజమాన్యాలు టన్ను తోతాపురి ఏ ధరకు కొన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులను ఆదుకోవడం చేతకాకే తమపై తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నారని విమర్శించారు. జగన్ పర్యటన అంతా ఓ డ్రామా అని.. దాన్ని తిప్పికొట్టాలని రైతులకు సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న మండీ యాజమానులు, టీడీపీ నాయకులు

- ఐదేళ్లు దోచుకుని ఇప్పుడేమో

ఎవరి ఖర్చులు వారివా?

- మాజీ సీఎం పర్యటన ఖర్చు విషయంలో వైసీపీ నేతల మధ్య పొరపొచ్చాలు

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో జిల్లా వైసీపీ నేతల మధ్య పొరపొచ్చాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. బంగారుపాళ్యం మండలం పూతలపట్టు నియోజకవర్గంలోకి వస్తుండడంతో మొత్తం ఖర్చును అక్కడి ఇన్‌చార్జి సునీల్‌కుమార్ భరించాలని తొలుత 'బడా' నాయకుడు సూచించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యే కానని, అంత మొత్తం భరించలేనని ఆయన వివరణ ఇచ్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. తన నియోజకవర్గం వరకే ఖర్చు పెట్టుకునేందుకు ఒప్పుకున్నట్లు సమాచారం. మిగతా నియోజకవర్గాల్లోనూ ఆయా ఇన్‌చార్జులు ఖర్చు పెట్టుకుని ప్రజల్ని తరలించాలని ఆ బడా నేత సూచించారట. మొత్తం ఖర్చు ఆ బడా నాయకుడే భరిస్తారని అనుకున్నా.. ఆయన పట్టించుకోక పోవడంతో 'ఐదేళ్ల పాటు మైన్స్‌లో, వైన్స్‌లో భారీగా దోచుకుని ఇప్పుడు అధినేత పర్యటన ఖర్చును విభజించడం ఏంట'ని వైసీపీ నేతలు చర్చించుకుంటున్నారు. ఆ బడా నాయకుడు కూడా తన నియోజకవర్గంలో మాత్రమే ఖర్చు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి 2029 ఎన్నికల్లో టికెట్ ఆశిస్తుండడంతో ఆ దిశగా జనసమీకరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తన కొడుకు అభినయ్‌రెడ్డిని ఎలివేషన్ చేసుకునేందుకు నియోజకవర్గం నుంచి సుమారు వెయ్యి మందితో వచ్చి బలప్రదర్శన చేయనున్నట్లు తెలుస్తోంది. మిగతావాళ్లు నామమాత్రంగా జనాల్ని తరలించే ప్రయత్నం చేస్తుండగా, నగరి నుంచి రోజా పాత్ర పెద్దగా లేనట్లు తెలుస్తోంది.

- మతి స్థిమితంలేని వ్యక్తుల

నియంత్రణకు ప్రణాళిక

- ఎస్పీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాల ఏర్పాటు

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం సైకో వీరంగంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరునగరిలో భిక్షగాళ్లు, మతిస్థిమితం లేని వ్యక్తులు, సైకోల ఏరివేతకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా తిరుపతి ఈస్ట్, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఉన్నారని పోలీసులు గుర్తించారు. వీరంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎక్కడ తల దాచుకుంటున్నారనేది పరిశీలించి ఎంఆర్‌పల్లెలోని బెగ్గర్ల షెల్టర్‌కు తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం తిరుపతిలో 60 నుంచి 70మంది భిక్షగాళ్లు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీరితో పాటు మతిస్థిమితం లేని వ్యక్తులున్నారు. వీరిని చట్ట ప్రకారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి ఆస్పత్రికి తరలించి వారి మానసిక స్థితిపై సర్టిఫికెట్ తీసుకున్నాక అవసరమైన వారిని వైజాగ్‌లోని ఆస్పత్రికి తరలించడానికి పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మతిస్థిమితం లేని వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని డీఎస్పీ భక్తవత్సలం విజ్ఞప్తి చేశారు.

మతిస్థిమితం లేకనే హత్య

తిరుపతి కపిలతీర్థం సమీపంలో సోమవారం కత్తి, కర్రతో వీరంగం సృష్టించి ఒకరి హత్యకు.. ఇద్దరు గాయపడటానికి కారణమైన వ్యక్తిని మంగళవారం రుయాస్పత్రికి తరలించారు. ఇతడిని పరీక్షించిన వైద్యులు.. మానసిక స్థిమితం లేదని నిర్ధారించారని అలిపిరి సీఐ రామ్‌కిషోర్ చెప్పారు. అతడిని బుధవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో వైజాగ్‌లోని మెంటల్ ఆస్పత్రికి తరలించనున్నామన్నారు.

పుత్తూరులో చెత్తకు కదలిక

- వడివడిగా చర్యలు



డంపింగ్ యార్డ్ వద్ద చెత్తశుద్ధికి ఏర్పాటు చేసిన యంత్రాలు

పుత్తూరు అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఏడేళ్లుగా పేరుకుపోయిన చెత్త నిల్వలకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. గోవిందపాలెం డంపింగ్ యార్డులో గుట్టలుగా పేరుకుపోయిన 20 వేల టన్నుల చెత్తశుద్ధికి చర్యలు ప్రారంభయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చాలా సార్లు చెత్త సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందన ఉండేదికాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త సమస్యపై శ్రద్ధ పెట్టింది. ఇందులోభాగంగా జిగ్మా సంస్థ ఈ-వేలంలో చెత్త శుద్ధి ప్రక్రియను దక్కించుకుంది. వారం రోజుల క్రితం యంత్రాల సాయంతో చెత్త తొలగించేందుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనతో అదనపు యంత్రాలతో పనులను వేగవంతం చేసింది. ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు, ప్రాసెస్ చేసిన వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు అందించనుంది. పొడి వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తుంని పబ్లిక్ హెల్త్ అధికారులు తెలిపారు.

చిత్తూరులో బిచ్చగాడిని చంపిన మరో బిచ్చగాడు

చిత్తూరు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బిచ్చగాడిని మరో బిచ్చగాడు రాడ్డుతో కొట్టి చంపిన సంఘటన చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం అరగొండకు చెందిన లోకేష్, జీడీ నెల్లూరు మండలం కోటాగరానికి చెందిన దివ్యాంగుడైన రాజేంద్రలు నగరంలో వివిధ ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పోస్టాఫీసు వీధికి ఎదురుగా ఉన్న క్రాంతి ఫొటో స్టూడియో పక్కనే టీ దుకాణం వద్దకు ఇద్దరు చేరుకున్నారు. ఈ సమయంలో ఇద్దరికీ మాటామాట పెరిగడంతో ఆగ్రహానికి గురైన లోకేష్ పక్కనే ఉన్న రాడ్డుతో రాజేంద్ర తలపై బాదాడు. దాంతో రాజేంద్ర అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

ఈదఫా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో కూడా

పాల్గొననున్న 3,47,565 విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సంబంధాలను బలపరిచి.. మరింతగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈఏడాది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పెద్దఎత్తున సమావేశాలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ (ఎంపీటీఎం) సమావేశాలు జరుగనున్నాయి. మొత్తం 3,47,565 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఎంపీటీఎం సమావేశాలను ఇదివరకెన్నడూ లేనివిధంగా పతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఇంటర్, పాఠశాల విద్యాశాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆయా శాఖల కంపోజిటివ్ గ్రాంట్ నుంచి 20 శాతం నిధులను ఖర్చుచేసి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యనుబట్టి నిధులను కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా పలు రకాల కమిటీలను ఏర్పాటుచేశారు.

ఈ ప్రయోజనార్థమే ఎంపీటీఎం

- పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను తల్లిదండ్రులకు అందజేయనున్నారు. సమగ్ర శిక్ష అధికారులు సిద్ధం చేస్తున్న ఈ ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు, హాజరుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో విద్యార్థుల ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు.
- విద్యార్థులు ఇళ్లల్లో ఉన్నపుడు తల్లిదండ్రులు వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాల గురించి పెద్దలకు అవగాహన కల్పించనున్నారు. సెల్‌ఫోన్ల వాడకం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలతోపాటు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించేలా ఇంటారక్షన్ సెషన్లు నిర్వహించనున్నారు.
- తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.
- కుటుంబ ఫొటో డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్ట్ కార్యక్రమాలు చేపడుతున్నారు.



నాలుగు సింగిల్ విండోలకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీల మార్పు

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు ప్రాథమిక సహకార సంఘాలకు (సింగిల్ విండోలు) పర్సన్ ఇంఛార్జి కమిటీలను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాలెం, రామచంద్రాపురం, మల్లంగుంట, చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోలకు ప్రస్తుతం అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీలు వున్నాయి. వాటి స్థానంలో ప్రభుత్వం తాజాగా నాన్ అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీలను నియమించింది. ఎర్రావారిపాలెం సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా ఎన్.రఘు, సభ్యులుగా పల్లెపాకు నాగరాజు, డి.దేవేంద్రనాయుడు, రామచంద్రాపురం సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా సి.జనార్దన చౌదరి, సభ్యులుగా ఏ.చిరంజీవి, ఎం.చిరంజీవిలు, మల్లంగుంట సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా సి.మధుశేఖర్, సభ్యులుగా వి.చిరంజీవి, పి.మోహన్‌రెడ్డిలు నియమితులయ్యారు. ఈ కమిటీలు ఈనెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. తర్వాత కమిటీల పదవీ కాలాన్ని పొడిగించే అవకాశముంది. అలాగే చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోకు ఛైర్మన్‌గా ఎం.ప్రభాకర్, సభ్యులుగా జి.శోభారాణి, పి.అలివేలమ్మ నియమితులయ్యారు. ఈ కమిటీ అక్టోబరు 30 దాకా కొనసాగనుంది. ఆపై ఈ కమిటీ గడువును కూడా పొడిగించే అవకాశముంది.

ఎస్‌పీఆర్ఈఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(వైద్యం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలను పొందేందుకు స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్ (ఎస్‌పీఆర్ఈఈ) పథకాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐ కార్పొరేషన్ రాయలసీమ ఆర్డీడీ రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ పథకం జూలై 1 నుంచి డిసెంబరు 31 వరకు అమల్లో ఉంటుంది. సంస్థలు, ఉద్యోగులను ఈఎస్ఐసీ పోర్టల్, శ్రామ్ సువిధ, ఎంసీఏ పోర్టల్ ద్వారా డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు. పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

వామ్మో.. ఎంత పెద్ద లారీ



సాధారణంగా నాలుగు, ఆరు చక్రాల లారీలను చూస్తుంటాం... అప్పుడప్పుడూ పది, పదహారు చక్రాల లారీలనూ చూసుంటాం. కానీ మంగళవారం తడలో 50 చక్రాల లారీ అందరినీ ఆకర్షించింది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కెలా నుంచి తడ మీదుగా చెన్నైకు భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న 50 చక్రాల చక్రాల లారీ తడలో కొంతసేపు ఆగింది. లారీపై భారీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో జనం ఆసక్తిగా గమనించారు.

- తడ, ఆంధ్రజ్యోతి

ముగిసిన జ్యేష్టాభిషేకం





తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన కవచ సమర్పణ క్రతువుతో జ్యేష్టాభిషేకం ముగిసింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని మండపంలోకి వేంచేపుచేశారు. వివిధ క్రతువులు నిరవహించారు. శాత్తుమొర, ఆస్థానం జరిపించి మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30గంటల మధ్య స్వామి, అమ్మ వార్లకు శాస్త్రోక్తంగా కవచ సమర్పణ పూర్తిచేశారు. సాయంత్రం ఉభయనాంచారులతో స్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవర్లను దర్శించుకున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సేవలో చెన్నై హైకోర్టు సీజే



ఆలయం వద్ద జస్టిస్ కేఆర్ శ్రీరామ్

తిరుచానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి):పద్మావతి అమ్మ వారిని మంగళవారం చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం తమిళనాడు బీజేపీ నేత అన్నామలై కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.48 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,081

తలనీలాలు సమర్పించినవారు: 28,775



చరమాంకంలోనూ చెదరని సంకల్పం

● పురాతన కరెన్సీ, నాణేల సేకరణ హాబీ ● 75 ఏళ్ల వయసొచ్చినా అదే అభిరుచి



కణన్ షణ్ముగం, సేకరించిన నాణెలు, కరెన్సీ

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 75ఏళ్ల వయసులోనూ తన అభిరుచి కోసం పరితపిస్తున్నారాయన. పురాతన నాణేలను,కరెన్సీని సేకరించాలని పట్టుదలతో ముందడుగు వేస్తున్నారు. ఈక్రమంలోనే కోట మండలం చిట్టేడు గ్రామానికి ఇటీవల వచ్చారు కణన్ షణ్ముగం. తన విశేషాభిరుచి గురించి ఆయన ఆంధ్రజ్యోతితో పంచుకున్నారిలా.. మాది చిత్తూరు. మానాన్న తమిళనాడులోని రాయవేలూరులో స్థిరపడ్డారు. నేను 1973-74ప్రాంతంలో ఇండియా తరపున ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా వ్యవహరించాను. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. భార్య చెన్నైలో ఉంది. నాకు పురాతన నాణేలు,వివిధ దేశాల కరెన్సీ సేకరించడమంటే ప్రాణం. ఈక్రమంలోనే 50 ఏళ్లగా చాలా దేశాల్లో తిరిగాను. ఆయా దేశాలకు సంబంధించి 700 నుంచి 800 ఏళ్ల నాటి కరెన్సీ నోట్లు, నాణెలను సేకరించాను. అమూల్యమైన నాణేలను ఇప్పటికీ చెక్కు చెదరకుండా భద్రపరిచాను. నాదగ్గరున్న యూకే నాణేలు చాలా ఖరీదైనవి. పురాతన కరెన్సీ, నాణేలను ఆయా దేశాల మ్యూజియంలకు అప్పగించాలనేది నా సంకల్పం. మూడు నెలలుగా చిట్టేడు విద్యానగర్‌లోని స్నేహితుడి ఇంటి వద్ద ఉంటున్నాను. పురాతన నాణేల సేకరణలో భాగంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో తిరుగుతున్నాను. ఈగ్రామ ప్రజలకు పురాతన నాణేలు,కరెన్సీ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు షణ్ముగం వివరించారు.

తిరుమలలో మళ్లీ తట్టల జోరు

● కొత్తగా 20 తట్టలకు అనుమతి?

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా తిరుమల కొండమీద కొందరి దందా మాత్రం యధాతథంగానే కొనసాగుతోంది. తిరుమలలో అనధికార తట్టలు(చిన్నపాటి అంగళ్లు) నిదానంగా విస్తరిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కావలసినవారికి, కోరుకున్న చోట ఇష్టానుసారం తట్టలకు అనుమతులు ఇచ్చేశారు. కోట్లరూపాయలు చేతులు మారినట్టు దీనిమీద అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ ప్రక్షాళనలో భాగంగా అనధికార తట్టలకు అవకాశం ఉండబోదని అనుకున్నారు. అలాగే అనుమతి ఆధారంగా ఇష్టమొచ్చిన వ్యాపారాలు చేసుకోవడానికి కూడా వీలుండదని భావించారు. కొద్ది రోజులు పరిస్థితి మారినట్టు కనిపించింది. విజిలెన్స్ విభాగం ఈ అంశంపై విచారించి తట్టలకు అనుమతుల జారీలోనూ, స్థల మార్పిడిలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఒక నివేదిక కూడా ఇచ్చింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో తట్టలు కూడా తొలగించడంతో ఇక పద్ధతి ప్రకారమే అంతా జరుగుతుందని అనుకున్నారు. అయితే మళ్లీ అంతా మొదటికొచ్చింది. అనధికార తట్టల వ్యాపారాల జోరు పెరిగింది. తాజాగా, వరాహస్వామి, పాత అన్నప్రసాద కేంద్రం ప్రాంతాల్లో దాదాపు 20 తట్టలు ఏర్పాటు చేసుకునేందుకు రెవెన్యూ విభాగం అనుమతులు జారీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వీరికి అనుమతి ఎవరిచ్చారు, ఎందుకు ఇచ్చారు అంటూ ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. తట్టల వ్యాపారం అదుపు తప్పితే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం రవాణా కేసులో నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ ఫారెస్ట్ బీటు అధికారి ఖ్యాతి తెలిపిన వివరాల మేరకు ఎర్రావారిపాళెంకు చెందిన ఎస్.బాలసుబ్రహ్మణ్యం 2016లో తలకోన సెంట్రల్ బీట్ నుంచి ఐదు ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. ఈకేసు తొమ్మిదేళ్లుగా దర్యాప్తు దశలో ఉంది. తాజాగా ఏపీపీ బాలకృష్ణ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ప్రదీప్‌చంద్, డీఆర్వో బాబుప్రసాద్‌లు న్యాయమూర్తి ఎదుట సాక్షాధారాలను నిరూపించారు. దీంతో మంగళవారం నిందితునికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం

● పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు ● మరో ఇద్దరికి గాయాలు







రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పద్మ - చికిత్స పొందుతూ మృతి చెందిన జశ్వంత్‌సాయి - గాయపడిన హేమలత

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తొండవాడ జాతీయ రహదారిలో పాల ట్యాంకర్‌ను కారు ఢీకొన్న దుర్ఘటలో తల్లి కొడుకు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు విజయవాడకు చెందిన కోటేశ్వరరావు, భార్య పద్మ(40), కుమారుడు జశ్వంత్‌సాయి(14), సోదరి హేమలతలు కారులో తిరుణామలైకు వెళ్లారు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కారు కోటేశ్వరరావు నడుపుతున్నారు. పక్క సీటులో కుమారుడు జశ్వంత్ సాయి, వెనుక సీటులో పద్మ, హేమలతలు కూర్చొన్నారు. తొండవాడ సమీపంలోని పూతలట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వీరి కారు వేగంగా వెళ్తూ ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారు వేగంగా ఢీకొనడంతో బెలూన్‌లు కూడా ఓపెనయ్యాయి. పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. జశ్వంత్ సాయి, హేమలతలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన జశ్వంత్ సాయి, హేమలతలను స్థానికులు బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లో వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జశ్వంత్ సాయి మృతి చెందాడు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కోటేశ్వరరావు కోలుకుంటున్నారు. ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్ బాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలలుగా ఏం చేశావ్ జగన్?

● రైతులను ఆదుకోవాలంటే మీ నేతల ఫ్యాక్టరీల్లో రూ.12కి కొనిపించండి

● రైతు సంఘం నాయకుల సలహా

తిరుపతి(ఆటోనగర్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): 'రెండు నెలలుగా ఏం చేశావ్. ఇప్పుడు పంట వడిగి పోతున్న సమయంలో బంగారుపాళ్యం వచ్చి రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడటం వల్ల ఒరిగేది ఏమీ లేదు. రైతులను ఆదుకోవాలనుకుంటే.. జిల్లాలో మీ నేతలకే ఎక్కువ గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పటినుంచైనా వారిచేత రూ.12కు కొనిచ్చేలా ప్రకటన చేయండి' అంటూ టీడీపీ రైతు సంఘం నాయకులు సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం పి.నాగేశ్వర్ రాజు, శివకోటేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఈ ఏడాది అంచనాల కంటే లక్ష టన్నులు అదనంగా పంట వచ్చిందన్నారు. దీనిని గ్రహించే తాము మార్చి నుంచే మామిడి రైతులతో పలుదఫాలు చర్చలు జరిపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.ప్రభుత్వం స్పందించి టన్నుకు రూ.నాలుగు వేలు చెల్లించడానికి అంగీకరించిందన్నారు. అధికారులతో, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో పదే పదే చర్చలు జరిపి మామిడి పంటను పూర్తిగా కొనేలా ఆదేశాలిచ్చారన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా వున్న మీరు రైతులకు చేసిన మేలు ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె.గోపీనాథ్ రెడ్డి, టి.ప్రకాష్ నాయుడు, పి.చిన్నారెడ్డి, కె.సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రైతు సంఘ నాయకులు



నల్లపరెడ్డిపై చర్యలేవీ జగన్?

● టీడీపీ నేతల నిరసన

తిరుపతి, జూలై8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన నీచ వ్యాఖ్యలపై జగన్‌రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమంటే మహిళలను అవమానించడమేనని టీడీపీ నేతలు మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం తిరుపతిలో నిరసన తెలిపారు. జగన్ రెడ్డి అండతోనే వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రసన్నకుమార్‌రెడ్డి దిగజారుడు మాటలపై మహిళాలోకం ఆగ్రహంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, పాటకం వెంకటేష్, రామ్మూర్తి రాయల్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, అనిత తదితరులు పాల్గొన్నారు.

గదులు కేటాయించే ఎంబీసీ వద్ద భక్తుల మధ్య ఘర్షణ

● విజయవాడ భక్తుడిపై రాళ్లు విసిరిన ఇంటర్ విద్యార్థి

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదులు కేటాయించే ఎంబీసీ34 వద్ద ఇద్దరు భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో సహనం కోల్పోయిన ఓ ఇంటర్ విద్యార్థి రాళ్లు విసరడంతో విజయవాడకు చెందిన ఓ భక్తుడు గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన మోహన్‌కృష్ణ ఇంటర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చాడు. గది పొందేందుకు ఎంబీసీ34 కౌంటర్ వద్దకు వెళ్లారు. విజయవాడకు చెందిన రవిప్రసాద్ కూడా గది తీసుకునేందుకు ఎంబీసీ34కు చేరుకున్నాడు. క్యూలైన్‌లో రాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చేడనే కారణంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటలు పెరిగి బూతులు తిట్టుకునే వరకు చేరుకోవడంతో సహనం కోల్పోయిన మోహన్‌కృష్ణ పక్కనే ఉన్న చిన్నపాటి రాళ్లతో రవిప్రసాద్‌పై విసిరాడు. దీంతో రవిప్రసాద్ ఛాతీపై చిన్నగాయమైంది. దీంతో అక్కడి ఉద్యోగులు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకునేలోగా మోహన్‌కృష్ణ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతడి స్నేహితుల ద్వారా పోలీసులు మోహన్‌కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఘర్షణలకు పాల్పడితే ఆధార్ బ్లాక్ చేస్తాం

సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు తోటి భక్తులను ఇబ్బంది పెడుతూ త్వరితగతిన గదులు పొందాలని ప్రయత్నించినా.. ఘర్షణకు పాల్పడినా వారి ఆధార్ కార్డులను బ్లాక్ చేస్తామని టీటీడీ హెచ్చరించింది. ఎంబీసీ34 గదుల కేటాయింపు వద్ద భక్తుల మధ్య ఘర్షణ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఈ ప్రకటన చేసింది. 'భక్తుల రద్దీ సాధారణంగాఉంది. గదులు అందుబాటులోనే ఉన్నాయి. అయినా సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు సహనాన్ని కోల్పోయి ఘర్షణ వాతావరణం సృష్టించడం బాధాకరం. హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 8(ఆంధ్రజ్యోతి): పి4లో భాగంగా ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం వివిధ శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ శనివారం లోపు ప్రతి రెవెన్యూ డివిజన్‌లో కనీసం 20మందికి తక్కువ కాకుండా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. తానూ కలెక్టరేట్ సమీపంలోని నక్కల కాలనీలో మూడు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం కింద 17వ తేదీన నగదు విడుదల చేయాలన్నారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు కలిసి ఈ నెల 10 జరిగే మెగా పేరెంట్స్ , టీచర్స్ మీటింగ్2.0ను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో సమస్యలకు గడువులోపు పరిష్కారం చూపకుంటే అందుకు వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): పదేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయిలో బుధవారం కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు నిరసనలు తెలియ జేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధించి పాలకులకు కనువిప్పు కలిగేలా ఆందోళనలు చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.రామానాయుడు,శివరెడ్డి, పి.మురళి, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా.. సహకారమా?

● ఒకరి బీమా సొమ్ము మరొకరి ఖాతాకు జమలో అధికారుల పాత్ర ఎంత?

పెళ్లకూరు/నాయుడుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో బీమా తీసుకుంది ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లు. మెచ్యూర్ సొమ్ము జమైంది ఆరూరు సిద్దయ్య కుమారుడు వెంకటేశ్వర్లు బ్యాంకు అకౌంట్‌కు. వీరిద్దరికీ పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామమే. బంధువులే. ఇలా ఎల్ఐసీకి తప్పుడు బ్యాంకు ఖాతా వివరాలిచ్చి రూ.19.87 లక్షలు కాజేసిన ఘటనలో అధికారులది సహకారమా.. నిర్లక్ష్యమా అనేది తేలాల్సి ఉంది. బాధితుడికి వడ్డీసహా డబ్బులిస్తామని చెబుతున్న అధికారులు బాధ్యులపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పాలసీ మెచ్యూర్ సమయం ముగిసింది. ఈ రూ.19,87,500 లక్షలు రావాలి. మే నెల 9న తన బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ తదితరు ధ్రువీకరణ పత్రాలను నాయుడుపేట ఎల్ఐసీ కార్యాలయంలో సమర్పించారు. జూన్ 27న ఆయన బ్యాంకు ఖాతాకు నగదు జమవుందని తెలిపారు. అయితే, జూలై ఒకటి వరకూ నగదు జమ కాకపోవడంతో ఆరూరు వెంకటేశ్వర్లు ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లి వాకబు చేశారు. తనకు జమ కావాల్సిన నగదు జూన్ ఆరో తేదీన తమ సమీప బంధువైన ఆరూరు సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు ఖాతాకు జమ చేసినట్లు తెలిసి కంగుతిన్నాడు. రెండు నెలలు కిందటే అన్ని వివరాలు ఇచ్చినా వేరే వారి ఖాతాకు ఎలా నగదు బదిలీ అయిందని నిలదీయగా, ఎక్కడ ఏం జరిగిందో తెలుసుకుని న్యాయం చేస్తామని నచ్చజెప్పినట్లు తెలిసింది. ఎల్ఐసీ అధికారుల విచారణలో సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పేరిట నాయుడుపేటలోని బ్యాంకు ఖాతాలో జమయినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఎల్ఐసీలోని కొంతమంది సిబ్బంది ద్వారా తన తండ్రి ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి సిద్దయ్య) ఆధార్, పాన్, మొబైల్ నెంబర్ల వివరాలను ఆరూరు జ్ఞానేంద్ర ఇచ్చి.. ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి వెంకటసుబ్బయ్య) ఎల్ఐసీ ఖాతాకు లింకు చేసినట్లు సమాచారం. తన తండ్రి ఖాతాలో జమయిన నగదును తన ఖాతాలోకి మార్చుకుని అనంతరం రూ.10 లక్షలు తన భార్య.. రూ.9 లక్షలు తన అత్త పేరుమీద అతడు చాకచక్యంగా మార్చుకున్నట్లు తెలిసింది. నాయుడుపేట ఎల్ఐసీ అధికారులు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యాలయానికి వివరాలను తెలియజేశారు. ఇలా ఎల్ఐసీ అధికారులను బురిడీ కొట్టించిన వ్యక్తిని.. అతడికి సహకరించిన ఎల్ఐసీ సిబ్బందిపైనా ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధితుడు వాపోయారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించి భవిష్యత్తులో మరొకరికి ఇలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు. కాగా, ఇందులోని బాధ్యులు.. బాధితుడి బ్యాంకు ఖాతాలో నగదు జమచేయించేలా చర్యలు చేపట్టినట్లు తెలిసింది. మరి, బాధ్యులపై ఎలాంటి చర్యలుంటాయో చూడాలి.

మూడు మార్గాల్లో 48 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకొని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-హిస్సార్‌ల మధ్య నడుస్తున్న వారాంతపు రైళ్లను సెప్టెంబరు వరకు పొడిగించింది. అలాగే కాచిగూడ-తిరుపతిల మధ్య 8 ప్రత్యేక రైళ్ళు ఏర్పాటు చేశారు. తిరువణ్ణామలైలో కొండ చుట్టూ తిగడానికి భక్తుల రద్దీ పెరగడంతో, నరసాపూర్ -తిరువణ్ణామలైల మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు.

తిరుపతి-హిస్సార్‌ల మధ్య 24 వారాంతపు రైళ్లు

● తిరుపతి-హిస్సార్ మధ్య వారాంతపు రైళ్లను బుధవారం నుంచి సెప్టెంబరు 28 వరకు పొడిగించారు.తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07717) ప్రతి బుధవారం బయలుదేరి రెండవ రోజుకు హిస్సార్ చేరుకొంటుంది.హిస్సార్‌లో ఈ ప్రత్యేక రైలు (07718)ప్రతి ఆదివారం బయలుదేరి వచ్చిన మార్గంలోనే తిరుపతికి చేరుకుంటుంది.

కాచిగూడ -తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

● కాచిగూడలో ఈ నెల 10,17,24,31,తేదీల్లో ప్రతి గురువారం ఈ ప్రత్యేక రైలు(07653) బయలు దేరి మల్కాజ్‌గిరి, జనగాం, గూడూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజుకు చేరుకొంటుంది. తిరుపతిలో ఈ నెల 11, 18, 26, ఆగస్టు1వ తేదీల్లో ఈ రైలు(07654) బయలుదేరుతుంది.

నరసాపూర్-తిరువణ్ణామలై మధ్య 16 ప్రత్యేక రైళ్లు

● నరసాపూర్‌లో ఈ నెల 9, 16, 23, ఆగస్టు6, 13, 20, సెప్టెంబరు 3, 24 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు (07219) బయలుదేరి విజయవాడ, తెనాలి, తిరుపతి, చిత్తూరు, వేలూరు మీదుగా మరుసటి రోజు తిరువణ్ణామలైకి చేరుకొంటుంది. తిరువణ్ణామలైలో ఈ నెల 10, 17, 24, ఆగస్టు 7, 14, 21, సెప్టెంబరు 4, 25 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07220) బయలుదేరి మరుసటి రోజు నరసాపూర్‌కు చేరుకుంటుంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఘనంగా రొట్టెల పండుగ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముతవల్లి

చిల్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక దోషా షహాద్ దర్గా వద్ద మంగళవారం రొట్టెల పండుగ ఘనంగా నిర్వహించారు. నెల్లూరు తరువాత చిల్లకూరు దర్గాలో రొట్టెల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. నెల్లూరు దర్గాలో పాల్గొన భక్తులు ఇక్కడి దర్గా వద్ద వచ్చి రొట్టెలను మార్చుకుని దర్గాలోని సయ్యద్ అహమ్మద్‌షా, సయ్యద్ మొహమ్మద్‌షా సమాధులను దర్శించుకుని ప్రార్థనలు జరిపారు. ముత్తవలి జుబేర్‌బాషా భక్తుల తలపై నెమలి పింఛం ఉంచి ప్రార్థనలు చేశారు.

ప్రజలను ఇబ్బంది పెడితే లోపలేయిస్తా
కౌన్సిలర్ తీరుపై ఎమ్మెల్యే కురుగొండ్ల ఆగ్రహం



4వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెడితే లోపలేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వైసీపీకి చెందిన స్థానిక కౌన్సిలర్ ఇంట్లోని మురుగునీటిని గుంతతీసి తమ ఇంటి వైపు మళ్లించాడని ఓ మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. ఆ కౌన్సిలర్‌పై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయని స్థానిక టీడీపీ నేతలు చెప్పడంతో ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి కౌన్సిలర్‌కు ఒకసారి చెప్పి చూడండి... వినకపోతే పోలీసు కేసు పెట్టండని ఆదేశించారు. అనంతరం వార్డులో ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధరం, పునుగోటి విశ్వనాథ నాయుడు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు, దొంతు మునేయ్య, బొలిగల వెంకటసుబ్బయ్య, పచ్చారి నరసయ్య నాయుడు, గడ్డం మురళి, రామకృష్ణ, నరసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



నవధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఏడీపీఎం పట్టాభిరెడ్డి

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి అన్నారు. కోటలోని 1వ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం ఏటీఎం సాగు, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలతో పాటు జనుము, జొన్న, పిల్లిపెసర, సజ్జ, మొక్కజొన్న, ఉలవ, కంది, ఆముద, ఆవాలు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నీలిమ, మోడల్ మేకర్ శ్రీనివాసులు, భాగ్యమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

సూళ్లూరుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. శారీరక ద్రవ్యరాశి కొలతలు తీశారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

వెంకటగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని నారాయణ స్కూల్ ఏజీఎం రియాజ్ అన్నారు. మంగళవారం పర్యావరణ పరిరక్షణపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి విద్యార్థీ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

వెంకటగిరి, జులై 8: తమ సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేసేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెంచలయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

వాకాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రెడ్డిమునెయ్య ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు రూ.4లక్షల చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, టీడీపీ నాయకులు ధశరధరామిరెడ్డి, దువ్వూరు జనార్దనరెడ్డి, పంత్రాంగం అరుణ్, రౌతు రమణయ్య, గుండాల శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను తరిమికొడతాం

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అవగాహనతో మాదక ద్రవ్యాలను తరిమికొట్టాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ కోరారు. కోటలోని అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలను దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్టు

సూళ్లూరుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 27న సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు వద్ద పోలీసులు 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో పరారీలో ఉన్న సూళ్లూరుపేట పట్టణం బొగ్గుల కాలనీకి చెందిన అజిత్ కుమార్, తడ మండలం కారూరుకు చెందిన రాకేష్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని కొండమిట్ట ప్రాథమిక పాఠశాలను మంళవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో రికార్డులను, విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

గూడూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.



వైద్యం కోసం వేచివున్న రోగులు - చికిత్స అందిస్తున్న నర్సు -మూసివున్న వైద్యుల గది

అక్కడ నర్సులే వైద్యులు
తడ పీహెచ్‌సీలో రోగులకు అందని వైద్యం

తడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తడ పీహెచ్‌సీలో రోగులకు వైద్యం అంతంత మాత్రంగానే అందుతోంది. పట్టణాలకు దీటుగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తడలో స్థానికులతో పెద్దసంఖ్యలో పాటు కార్మికులు, ఉద్యోగులు నివాసముంటున్నారు. వీరందరికీ తడ పీహెచ్‌సీనే దిక్కు. జాతీయ రహదారికి ఆనుకుని సుమారు ఎకరా స్థలంలో నిఫో పరిశ్రమ వ్యవస్థాపకుడు పొట్టిపాటి ఓబుళరెడ్డి 1990లో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని నిర్మించి ప్రభుత్వానికి అందజేశారు. అప్పట్లో వైద్యసేవలు బాగానే అందేవి. రానురాను ఆస్పత్రికి సుస్తీ చేసింది. ప్రస్తుతం తడ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ఒక ఫార్మాసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, నర్సులు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నట్లు అధికారిక సమాచారం. వాస్తవంగా ఇక్కడ పనిచేస్తున్న మహిళా వైద్యురాలు దీర్ఘకాలిక ప్రసూతి సెలవులో ఉండగా, మరో వైద్యుడు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే 104 క్యాంపులకు వెళ్తున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడంలేదు. ఒక రోజుకు 80 నుంచి 100 మంది వరకు రోగులు వస్తున్నా వారందరికీ నర్సులే వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలానికి ఆనుకునే సుమారు 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండడంతో తరచూ ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే క్షత గాత్రులకు ఇక్కడ వైద్యం అందే పరిస్థితి లేదు. వచ్చిన రోగులు నర్సులే మందు బిళ్లలు ఇచ్చి పంపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తడ పీహెచ్‌సీ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హామీలను నేరవేరుస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే: పాశిం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రామలింగాపురం, సంతదాసుపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటా ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ. 4వేలకు పెంచి ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందజేయడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి రూ.5కే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పేదల ఆకలిని తీరుస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. అనంతరం రామలింగాపురం గ్రామంలో రూ.6లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.9లక్షలతో నిర్మించి పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, కృష్ణారెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, అమరేంద్ర, జహంగీర్, మధురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం: విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కానూరు, శిరసనంబేడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త పార్థసారధి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలను అందజేశారు. ముందుగా తాళ్వాయిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, గూడూరు ప్రభావతమ్మ, నాయకులు వేలూరు కల్యాణ్‌రెడ్డి, దామెర ప్రసాద్‌నాయుడు, పేరం రమేష్ నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, కందమూడి శివకుమార్, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, వెంపళ్ల వెంకటేశ్వర్లు, గాలి రమేష్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కాటంరెడ్డి మల్లిఖార్జున రెడ్డి, పునబాక పోలయ్య, యాగాన్ని బెన్ని, కిలారి గోపి, గంగాబత్తిన రామకృష్ణ, దొమ్మరాజు సత్యనారాయణరాజు, వెంటయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం



జెమిన్‌కొత్తపాళెం గ్రామంలో మొక్కలను నాటుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు, బీజేపీ కన్వీనర్ పురుషోత్తమరెడ్డి

వాకాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అన్నారు. మండలంలోని జెమిన్‌కొత్తపాళెం గ్రామంలో రైతులకు చెందిన నాలుగు ఎకరాల్లో మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

వాకాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థిరమైన అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ట్రైనర్లు మల్లికార్జున, సునీల్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, ఎంఈవో నసీంఆలీ, సీడీపీవో మునికుమారి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడివయ్య కాలనీలోని గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో మంగళవారం అబ్దుల్ గఫూర్ దాతృత్వంతో బాస్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కూరపాటి రవీంద్రబాబు, జాన్‌పాల్ తదిత రులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ మృతి తీరనిలోటు



చంద్రశేఖర్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేవాంగ సంక్షేమ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు కన్నా చంద్రశేఖర్ మృతి తీరనిలోటని ఆ సంఘం అధ్యక్షుడు మన్నెం సతీష్ అన్నారు. చంద్రశేఖర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సజ్జా వెంకట సురేష్, కోశాధికారి మాధవరావు, మాదన ఉదయ్‌భాస్కర్, కొండా శేఖర్ తదితరులు మంగళవారం చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కూడా చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.

కమణీయం సీతారాముల కల్యాణం



స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేస్తున్న వేదపండితులు

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంట పాళెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం తెల్లవారుజామున సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం జరిగింది. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని పట్టాభిరామ ఆలయం నడుపుతున్న సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ సౌజన్యంతో సీతారాముల కల్యాణం జరిగింది. జిల్లా అర్చక సలహామండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ ఉత్తమ్ హోటల్ అధినేత కొడవలూరు ధనంజయరెడ్డి, నరేష్‌శర్మ, సాయి బాబా, సురేష్, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



గూడూరు, వెంకటగిరిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి - నాయుడుపేటలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఘనంగా వైఎస్సార్ జయంతి

గూడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని వైసీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ నివాళులర్పించారు. చేవూరు విజయ్ మోహన్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూం, సుబ్బారావు, మధురెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. నివాళులర్పించి, కేక్ కట్‌చేశారు. వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్, పాలేటి నాగార్జున, సిద్ధయ్య, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తికి న్యాయం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్

డక్కిలి, జులై 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తే రోగులకు అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయో అర్థం అవుతోంది.. ప్రభుత్వం నుంచి జీతం తీసుకొంటున్నందుకైనా వైద్య వృత్తికి న్యాయం చేయాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్ వైద్యులను హెచ్చరించారు. మంగళవారం ఆయన డక్కిలి ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఓపీ నమోదు గందరగోళంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య, కుటుంబనియంత్రణ ఆపరేషన్ల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అలాగే టీబీ ముక్త్ భారత్, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు, డయేరియా నియంత్రణపై సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో హరిత, వైద్యాధికారి హరి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా మెరుగుకు చర్యలు

చిల్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కడివేడు గ్రామంలో రూ.16.32 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సక్రమంగా విద్యుత్ సరఫరాను అందజేయకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయానికి ఎటువంటి కోతలు లేకుండా 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుండాల లీలావతి, తహసీల్దారు శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్ర వాహనదారులు, వ్యాపార దుకాణాలు తప్పకుండా నిబంధనలు పాటించాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం సీఐతో పాటు సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని బజారు ప్రధాన వీధుల్లో వ్యాపారస్తులు, పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వ్యాపా రస్తులు తమ దుకాణాల పరిధి దాటి రోడ్లపై వస్తువులు పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. తోపుడు బండ్లను రోడ్డులో పెట్టుకుని విక్రయాలు సాగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వ్యాపారస్తులు, ద్విచక్ర వాహనదారులు సహకరించాలన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోండి



తిమ్మాజికండ్రిగలో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

నాయుడుపేట టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. మండలంలోని తిమ్మాజికండ్రిగ, యర్రప్పశెట్టిపాళెం గ్రామాల్లో పంటలను మంగళవారం ఏవో గణేష్‌తో కలసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి అన్నదాత సుఖీభవ పథకంలో పేర్లు లేని రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యా కమిటీ చైర్మన్‌గా విజయ భాస్కర్

చిట్టమూరు, జులై 8(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చెర్మన్‌గా మల్లి విజయ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉన్న చైర్మన్ బద్దిగ నారాయణ మృతి చెందడంతో మంగళవారం నూతన చైర్మన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి బషీర్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గువ్వల సురేష్ పాల్గొన్నారు.

అవాజ్ కమిటీ ఎంపిక

నాయుడుపేట టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య భవనంలో నూతన అవాజ్ కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రషీద్ తెలిపారు. మంగళవారం అవాజ్ మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం జనరల్ బాడీ సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా హలీమ్‌ఖాన్, కార్యదర్శిగా ఖాదర్, ఉపాధ్యక్షులు షేక్ అన్సర్, షేక్ ఉస్మాన్, సహాయ కార్యదర్శులు షేక్ కాలేషా, షేక్ అబ్దుల్లా, ట్రెజరర్‌గా రియాజ్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

మద్దాలిలో పొలం పిలుస్తోంది

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దాలి, కేశవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అవసరం మేరకే ఎరువులు పంటలకు వాడాలని సూచించారు. అదే విధంగా ప్రధాన మంత్రి కిసాన్, అన్నదాత సుఖీభవ, ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగితే వర్తిచే బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సాయి మహేష్ పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామానికి చెందిన రేణుక అనే బాలిక కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్యఖర్చుల కోసం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15వేలు మంగళవారం అందజేవారు. ట్రస్ట్ సభ్యులు ప్రజేంద్రరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.